విలేకరులు కావలెను

TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును

9703247143



TELANGANA VANI TELUGU DAILY

R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక



తెలంగాణ వాణి

20వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

తెలంగాణ వాణి కుటుంబ సభ్యులకు 20వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

తెలంగాణ వాణి పాత్రికేయ కుటుంబ సభ్యులు, పాఠకులు, ప్రకటనకర్తలు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు శుభాకాంక్షలు



ఎడిటర్
జేరిపోతుల సంపత్
9912758107



సంపుటి: 16 | సంచిక : 80 | బుధవారం 15. 7. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00


## రాష్ట్రంలో మూడు రోజుల పాటు వర్షాలు



హైదరాబాద్ తెలంగాణ వాణి)

తెలంగాణలో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెదర్ మ్యాన్ బాలాజీ పేర్కొన్నారు. జూలై 16 నుండి 19 వరకు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని అంచనా వేశారు. నేడు రాష్ట్రంలో హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల్లో వాతావరణం పొడిగానే ఉంటుందని ఎండగా పొడిగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. రేపటి నుండి రాష్ట్రంలో రుతుపవనాల ప్రభావం మరింత తగ్గుతుందని జూలై 15 నుండి ఉత్తర తెలంగాణలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేశారు. జూలై 16 నుండి రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని, హైదరాబాద్ తో పాటు ఇతర జిల్లాల్లోనూ విస్తారంగా కురుస్తాయని పేర్కొన్నారు. దీంతో ప్రస్తుతం ఉన్న వేడి ఉష్ణోగ్రతల నుండి ప్రజలకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు. ఇదిలా ఉంటే రాష్ట్రంలో ఈ ఏడాది సరిగ్గా వర్షాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



## కనీస అవగాహన లేకుండా పాలిస్తున్నారు..

- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్
- రేవంత్ రెడ్డి నీచమైన బాషను పక్కనపెట్టి సాగునీరు, తాగు నీరు అందించే చర్యలు తీసుకోవాలి
- సుందిళ్ళ, అన్నారం బ్యారేజీలకు 2024లోనే మరమ్మత్తులు చేసినట్టు ఎన్డీఎస్ఏ రిపోర్ట్ చెబుతోంది
- రేవంత్ రెడ్డి హెడ్ లైన్స్ కోసం మాట్లాడే వ్యక్తి
- చిత్తశుద్ధి ఉంటే ఎన్ నినోపై ఇంజనీర్లతో సమావేశమై చర్చించాలి



# ఆర్ఆర్ఆర్ దక్షిణ ప్రాంతానికి అనుమతులివ్వండి..

## తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- దిల్లీ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సమావేశం
- రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై గడ్కరీతో చర్చ
- ఆర్ఆర్ఆర్ ఉత్తరప్రాంత పనులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపాలి
- ఆర్ఆర్ఆర్ దక్షిణ ప్రాంతానికి అనుమతులు ఇవ్వాలి
- విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో బేటి
- వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చ
- అభివృద్ధికి విమానాశ్రయాలు అత్యంత కీలకం: రామ్మోహన్ నాయుడు
- వరంగల్ విమానాశ్రయ భూ సేకరణకు సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపించారు
- మూడు వారాల్లో పనులు ప్రారంభిస్తాం
- వరంగల్ ప్రాంత ప్రజలకు అద్భుతమైన విమానాశ్రయం వస్తుంది.
- తెలంగాణలో మరిన్ని విమానాశ్రయాలు రావాల్సిన అవసరముంది.
- ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నాం.

దిల్లీ:తెలంగాణ వాణి)

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిల్లీ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై గడ్కరీతో చర్చించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తరప్రాంత పనులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపాలని కోరారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ ప్రాంతానికి వెంటనే అనుమతులు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. అనంతరం విమాన యానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడిని కలిశారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. వరంగల్ విమానాశ్రయ భూ సేకరణకు సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపించారని, మూడు వారాల్లో పనులు ప్రారంభిస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. సీఎంతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.“ 2 జూన్ 2028 నాటికి వరంగల్ ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాం. వరంగల్ ప్రాంత ప్రజలకు అద్భుతమైన విమానాశ్రయం వస్తుంది. తెలంగాణలో మరిన్ని విమానాశ్రయాలు రావాల్సిన అవసరముంది. ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నాం. ఆదిలాబాద్‌లో రక్షణశాఖ భూముల వ్యవహారం తేలాక నిర్ణయం తీసుకుంటాం. వీలైనంత త్వరగా భూ సేకరణ పూర్తి చేసి ఆదిలాబాద్ విమానాశ్రయం పూర్తి చేస్తాం” అని కేంద్రమంత్రి తెలిపారు.

# సింగరేణిని కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయి

- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి
- గోదావరిఖనిలోని ఫైవ్ ఇంక్లైన్ గని ఆవరణలో నిర్వహించిన బీజేపీ భరోసా యాత్ర సభ
- ఒకప్పుడు సుమారు 1.2 లక్షల మంది కార్మికులు
- ప్రస్తుతం దాదాపు 35 వేల మంది మాత్రమే పనిచేస్తున్నారు
- 135 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి సంస్థను కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు నిర్వీర్యం
- కార్మికుల జీతాలు చెల్లించేందుకు బ్యాంకుల నుంచి అప్పులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది
- సింగరేణి భవిష్యత్తు బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది



## ఎల్‌నినో సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు






## సుప్రీంలో తెలంగాణకు చుక్కెదురు!

- ఏపీకి నోటీసులు ఇచ్చేందుకు నిరాకరించిన సుప్రీంకోర్టు
- బనకచర్ల అనుసంధానంపై పిటిషన్.. సాంకేతిక లోపాలు ఉన్నాయని స్పష్టీకరణ
- లోపాలు సవరిస్తేనే విచారణ :న్యాయస్థానం

2

# ప్రజా సంక్షేమం ఆపే ప్రసక్తే లేదు

## రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

- గత ప్రభుత్వం తెలంగాణను రూ.8.21 లక్షల కోట్ల అప్పులతో కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పగించింది
- రెండున్నరేళ్లలో రూ.2.08 లక్షల కోట్ల అసలు, వడ్డీ చెల్లిస్తూ ప్రజా సంక్షేమాన్ని అమలు చేశాం
- మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం కోసం ఇప్పటికే ఆర్టీసీకి రూ.12 వేల కోట్లు చెల్లించాం
- కోటి 6 లక్షల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి ఆరు కిలోల సన్నబియ్యం
- ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం
- 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం, పాలు, రాగిజావ అందిస్తున్నాం
- రాష్ట్రంలో 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు
- అదనంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి రూ.22,500 కోట్లతో నిర్మాణాలు



రాజోలి : తెలంగాణ వాణి)

పదేళ్ల పాటు రాష్ట్ర సంపదను దోచుకుని తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిన వారు మళ్లీ అధికారంలోకి వస్తామని చెబుతున్నారని, వచ్చి పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రద్దు చేయడానికేనా అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి మండలం జులేకల్ గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం తెలంగాణను రూ. 8.21 లక్షల కోట్ల అప్పులతో కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పగించిందని ఆరోపించారు. అయినప్పటికీ రెండున్నరేళ్లలో రూ. 2.08 లక్షల కోట్ల అసలు, వడ్డీ చెల్లిస్తూ ప్రజా సంక్షేమాన్ని ఏమాత్రం తగ్గించకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రాష్ట్రంలో ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ భీమా, వడ్డీలేని మహిళా రుణాలు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల వంటి పథకాలను నిరంతరంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఒక్కో కుటుంబానికి ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు.

## పౌరసత్వ నిర్ధారణలో పారదర్శకత ముఖ్యం

- అసోంలో 27మంది వ్యక్తుల పౌరసత్వంపై విచారణ
- వారిపై బలవంతపు చర్యలు తీసుకోరాదన్న సుప్రీం





## ఐక్యరాజ్యసమితి ఛార్టర్ ఉల్లంఘనలు

ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచుతున్న అమెరికా

తాజా దాడులపై మండిపడ్డ ఇరాన్

2

## పేపర్ లీక్‌లపై రాహుల్ మండిపాటు

- విద్యా వ్యవస్థ దోపిడీ యంత్రాంగంగా మారిందని విమర్శ
- 'ఛాత్రోన్ కీ గూంజ్'లో విద్యార్థులు పాల్గొనాలని పిలుపు

దేశంలో వరుసగా జరుగుతున్న ప్రశ్నపత్రాల లీకులు, విద్యా వ్యవస్థలో పెరుగుతున్న అవినీతిపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. భారత విద్యా వ్యవస్థ ప్రస్తుతం నిజాయతీ లేని దోపిడీ యంత్రాంగంగా మారిందని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు.



# సంపాదకీయం




## నూతన విద్యావిధానం అద్భుతం

తెలంగాణ విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే దిశగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సరికొత్త విద్యా విధానానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను ఒకే గొడుగు కిందికి తెస్తూ, వాటి నాణ్యతను అంతర్జాతీయ స్థాయికి పెంచేందుకు ఆయన తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనదిగా నిలు స్తోంది. ప్రస్తుతం తెలంగాణలో 27 వేల ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వాటిని విలీనం చేసి సుమారు 4 వేల అత్యాధునిక క్లస్టర్ మోడల్ స్కూళ్లుగా మార్చాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ వినూత్న నిర్ణయం గ్రామీణ, పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి ఉచిత విద్యను అందించడమే కాకుండా, విద్యా రంగంలో ప్రభుత్వ బడుల ప్రాభవాన్ని మళ్లీ చాటిచెప్పేందుకు ఒక అద్భుతమైన మైలురాయిగా మారబోతోంది. రాష్ట్రంలో ప్రస్తుత విద్యా గణాంకాలను పరిశీలిస్తే విస్తుపోయే వాస్తవాలు కనిపిస్తాయి. తెలంగాణలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం 18 లక్షల మంది విద్యార్థులు మాత్రమే చదువుతుండగా, కేవలం 17 వేల ప్రైవేట్ పాఠశాలల్లో ఏకంగా 37 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ బడుల్లో నిపుణులైన ఉపాధ్యాయులు, భారీ నిధులు ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య ఈ స్థాయిలో తగ్గడానికి ప్రధాన కారణం సరైన మౌలిక వసతులు, ప్రణాళిక లేకపోవడమే. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఒకే క్లాసులో ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలు ఉండటం, సింగిల్ టీచర్ వ్యవస్థ కొనసాగడం వల్ల బోధన కుంటుప డుతోంది. ఈ అంతరాన్ని గమనించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, వనరులను ఒకే చోట కేంద్రీకరించి నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ఈ పునర్వ్య వస్థీకరణకు పూనుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదట 2,500 క్లస్టర్ పాఠ శాలల ఏర్పాటును ప్రతిపాదించినప్పటికీ, భౌగోళిక పరిస్థితులు, విద్యార్థుల సౌక ర్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ సంఖ్యను 5 వేలకు పెంచితే మరింత ప్రయో జనకరంగా ఉంటుంది. ప్రతి ప్రధాన జిల్లా కేంద్రంలో, ఉదాహరణకు ఆదిలాబాద్ వంటి గిరిజన, వెనుకబడిన ప్రాంతాలలో సుమారు 10 వేల మంది విద్యార్థులతో ఒక భారీ విద్యా క్లస్టర్ను ఏర్పాటు చేయడం ద్వారా విద్యా ప్రమాణాలను సమూలంగా మార్చవచ్చు. ఒకే ప్రాంగణంలో నర్సరీ నుండి 12వ తరగతి వరకు ఉచిత విద్యా బోధనతో పాటు ఉచిత రవాణా, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు కల్పించడం వల్ల పేద తల్లిదండ్రులపై ఆర్థిక భారం పూర్తిగా తప్పుతుంది. ప్రైవేట్ స్కూళ్ల తరహాలోనే విద్యార్థులను ఇళ్ల వద్ద నుండి సురక్షితంగా బడికి చేర్చే రవాణా వ్యవస్థను ప్రభుత్వం ఉచితంగా అందించడం ఈ పాలసీలో అత్యంత ప్రశంసనీయమైన అంశం. ఈ కొత్త విద్యా క్లస్టర్ల విధానంలో భద్రతకు, పర్యవేక్షణకు అత్యున్నత ప్రాధాన్యత లభిస్తుంది. పాఠశాలల సంఖ్య పరిమితంగా ఉండి, వనరులు ఒకే చోట కేంద్రీకృతం కావడం వల్ల ప్రభుత్వ ఉ న్నతాధికారుల నియంత్రణ, తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి. క్లస్టర్ స్కూళ్ల పరిధిలో అత్యాధునిక నిఘా వ్యవస్థ, సీసీటీవీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయడం వల్ల ఆడపిల్లల రక్షణకు పూర్తి భరోసా లభిస్తుంది. సురక్షితమైన వాతావరణం, ప్రభుత్వ ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండటం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థినులు ఎటువంటి భయం లేకుండా ఉన్నత చదువుల కోసం ఈ పాఠశాలలకు తరలి వస్తారు. నకిలీ నివేదికలకు తావులేకుండా ప్రతి విద్యార్థి ప్రగతిని టెక్నాలజీ ద్వారా పర్యవేక్షించే వీలు కలుగుతుంది. ఈ నూతన విద్యా సంస్కరణలు తెలంగాణ సమాజంలో ప్రైవేట్ పాఠశాలల దోపిడీకి అడ్డుకట్ట వేయనున్నాయి. ఖాన్ అకాడమీ వంటి అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో డిజిటల్ బోధనను ప్రవేశపెట్టడం, ప్రభుత్వ ఉపాధ్యాయులకు విదేశాలలో శిక్షణ ఇప్పించడం ద్వారా కార్పొరేట్ స్కూళ్లకు మించిన డిజిటల్ విద్య సామాన్యుడికి అందుతుంది. చిన్న చిన్న పాఠశాలలుగా విడిపోయి ఉన్న వనరులన్నింటినీ ఏకం చేసి, కేంద్రీకృత ఆధునిక విద్యా వ్యవస్థను నిర్మించాలనే రేవంత్ రెడ్డి నిర్ణయం భవిష్యత్తు తరాల బంగారు బాటలకు బలమైన పునాది. ఈ విప్లవాత్మక మార్పుల ద్వారా తెలంగాణ విద్యా రంగం దేశంలోనే నెంబర్ వన్గా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది. తెలంగాణలోని నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను కల్పించ డంలో ఈ నూతన క్లస్టర్ విద్యా విధానం అత్యంత కీలకమైన పాత్ర పోషించబో తోంది. ఒకే పెద్ద ప్రాంగణంలో వేలాది మంది విద్యార్థులు కలిసి చదవడం వల్ల వారిలో సామాజిక స్పృహ, ఆరోగ్యకరమైన పోటీ తత్వం పెరుగుతాయి. చిన్న చిన్న బడులలో లభించని అత్యాధునిక సైన్స్ లాబొరేటరీలు, విశాలమైన డిజిటల్ లైబ్రరీలు, కంప్యూటర్ ల్యాబ్లు ఈ 5 వేల మోడల్ స్కూళ్లలో అందుబాటులోకి వస్తాయి. అంతేకాకుండా, ప్రతి పాఠశాలలో నైపుణ్యం కలిగిన వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రత్యేక క్రీడా మైదానాలు ఉండటం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అద్భుతమైన అవకాశం లభిస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టితో తీసుకున్న ఈ నిర్ణయం ఉపాధ్యాయుల కొరత సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపుతుంది. ప్రస్తుతం కొన్ని పాఠశాలల్లో పిల్లలు లేక ఉపాధ్యాయులు ఖాళీగా ఉ ండటం, మరికొన్ని చోట్ల పిల్లలు ఉండి టీచర్లు లేకపోవడం వంటి వ్యత్యాసాలు ఉ న్నాయి. ఈ సంస్కరణ ద్వారా ఉపాధ్యాయులందరినీ ఒకే చోట చేర్చి, సబ్జెక్టుల వారీగా ప్రత్యేక బోధనను అందించవచ్చు. దీనివల్ల ఉపాధ్యాయులపై పనిభారం తగ్గడమే కాకుండా, విద్యార్థులకు ప్రతి సబ్జెక్టుపై ప్రత్యేక శ్రద్ధ లభిస్తుంది. ప్రభుత్వ అధికార యంత్రాంగం నిరంతరం ఈ పాఠశాలల పనితీరును డిజిటల్ పద్ధతిలో సమీక్షించడం వల్ల విద్యా ప్రమాణాలు నిరంతరం పెరుగుతూనే ఉంటాయి. ఈ విప్లవాత్మక విద్యా సమూనా భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్గా నిలవడం ఖాయం. కార్పొరేట్ పాఠశాలల ఫీజుల భారాన్ని మోయలేక సతమతమవుతున్న మధ్యతరగతి, పేద కుటుంబాలకు ఈ ఉచిత అత్యున్నత స్థాయి విద్య ఒక గొప్ప వరంగా మారుతుంది. ప్రైవేట్ పాఠశాలల్లో కంటే మిన్నగా ఇంగ్లీష్ మీడియం బోధనతో పాటు, విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ఈ క్లస్టర్ స్కూళ్లు వేదికలు కానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ సాహసోపేతమైన, అద్భుతమైన నిర్ణయం తెలంగాణ విద్యా వ్యవస్థ రూపురేఖలను మార్చేస్తూ, రాబోయే తరాలకు సరికొత్త విద్యా విప్లవాన్ని బహుమతిగా ఇస్తోంది. వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన పేద విద్యార్థులకు నిజమైన సాధికారతను అందించడంలో ఈ నూతన విద్యా విధానం ఒక దిక్సూచిగా మారబోతోంది. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం, ఓట్ల వేట కోసం కొన్ని శక్తులు ఇచ్చే రాజకీయ హామీలు, సబ్సిడీలు నిరంతర ప్రయోజ నాన్ని ఇవ్వలేవు. రాబోయే కాలంలో ప్రైవేట్ రంగం, ప్రపంచ పారిశ్రామిక రంగం కేవలం ప్రతిభను, నైపుణ్యాలను మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటాయి తప్ప, రాజకీయ ఆధారిత రిజర్వేషన్లకు అక్కడ ప్రాధాన్యత ఉండదు. ఈ భవిష్యత్తు సవాలును ముందుగానే

ఊహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పేద దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల పిల్లలకు నాణ్యమైన అంతర్జాతీయ స్థాయి విద్యను ఉచితంగా అందించి, వారిని ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దుతున్నారు. నిజమైన సామాజిక న్యాయం అంటే ఉచితాలు ఇవ్వడం కాదు, కార్పొరేట్ శక్తులకు సమానంగా ప్రతిభను పెంపొందించే విద్యను అందించడమేనని ఆయన నిరూపించారు. ఈ చారిత్రాత్మక మార్పుల ద్వారా తెలంగాణలోని నిరుపేద వర్గాల పిల్లల భవిష్యత్తుకు బలమైన భరోసా లభిస్తోంది. కేవలం సంపన్నులకే పరిమితమైన డిజిటల్ విద్యను, అంతర్జాతీయ విద్యా ప్రమాణాలను సామాన్య బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల చెంతకు చేర్చాలనే రేవంత్ రెడ్డి గారి అంకితభావం నిజంగా అభినందనీయం. పాతకాలపు ఓటు బ్యాంకు రాజకీయాల శైలిని పక్కనపెట్టి, రాబోయే తరం యువతకు నిజమైన మేధో సంపత్తిని బహుమతిగా ఇస్తున్న ముఖ్యమంత్రి నిర్ణయం తెలంగాణ విద్యా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది. ఈ విప్లవాత్మక సంస్కరణలు భవిష్యత్తులో తెలంగాణ యువతను ప్రపంచవ్యాప్తంగా అగ్రగాములుగా నిలబెట్టడం ఖాయం.

# సింగరేణికి రాజకీయ విముక్తి ఎప్పుడు ?

- ప్రభుత్వం బాకీ 43 వేల కోట్ల బకాయిలు రికవరీ ఎప్పుడు
- లాభాల నుంచి 4వేల కోట్ల కేటాయింపుపై కార్మికుల ఆగ్రహం




**కొత్తగూడెం సింగరేణి, జూలై 14 (తెలంగాణ వాణి)**
తెలంగాణ ఉద్యమంలా సింగరేణి సంస్థ మనుగడ కోసం మరో ఉద్యమం అవసరమని సింగరేణి ప్రాంత ప్రజలు అభిప్రాయపడుతున్నారు. “సింగరేణి బిడ్డలారా లెండి, మేలుకోండి” అంటూ సంస్థ అభివృద్ధి కోసం పలువురు పిలుపునిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఏ సీఎం కూడా సింగరేణిలో జోక్యం చేసుకోలేదని, సంస్థ బీఐఎఫ్ఆర్ కు వెళ్లినప్పుడు రూ. 677 కోట్లు మాఫీ చేసి ఆదుకున్నారని స్థానికులు గుర్తు చేస్తున్నారు. “నాలుగు దశాబ్దాల క్రితం గనులొచ్చినయ్, రన్నింగ్లో పనులొచ్చి నయ్. ఇప్పుడు తెలంగాణ వచ్చిన తర్వాత సింగరేణి కుదేలైంది” అని నిరుద్యోగులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు సింగరేణి విద్యుత్ సంస్థలకు బొగ్గు సరఫరా చేసింది. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి సంస్థకు సుమారు రూ. 56 వేల కోట్లు బకాయి పడింది. ఏళ్లు గడుస్తున్నా ఆ బకాయిలు చెల్లించకపోవడంతో కొత్త గనుల ఏర్పాటు, సంస్థ అభివృద్ధి కుంటుపడుతుందని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోగా, సింగరేణి లాభాల నుంచి అభివృద్ధి పేరుతో రూ. 4,000 కోట్లు కేటాయించుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. కరోనా కిట్లకు, మెడికల్ కాలేజీకి రూ. 500 కోట్లు, ప్రభుత్వ గురుకుల పాఠశాలలకు సింగరేణి డబ్బులు వాడడమేమిటని కార్మిక వర్గం ప్రశ్నిస్తోంది. సి ఎస్ ఆర్, డి ఎం ఎఫ్ టి నిధులను సింగరేణి ప్రాంతాలకు కాకుండా ఇతర ప్రాంతాలకు ఖర్చు చేయడంపైనా అసంతృప్తి వ్యక్తమవుతోంది. గత 15 ఏళ్లలో ఒక్క బొగ్గు బ్లాకు కేటాయింపు లేదని, తెలంగాణ వచ్చిన తర్వాత 20 గనులు మూతపడ్డాయని, ఒక్క గను కూడా కొత్తగా ప్రారంభం కాలేదని యువత ఆందోళన వ్యక్తం చేస్తోంది. కార్మికుల సంఖ్య 1.20 లక్షల నుంచి 40 వేలకు పడిపోయిందని, లక్షన్నర జీతం నుంచి ప్రైవేటు గనుల్లో 15 వేలకు దిగజారిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. “ఉచితాల కోసం, రాజకీయ లబ్ధి కోసం సింగరేణిని మింగుతున్నారు. ఉన్నదంతా అమ్ముతున్నారు” అంటూ యువ కార్మికులు ముందుకు వచ్చి సంస్థ విధ్వంసాన్ని అడ్డుకోవాలని పిలుపునిస్తున్నారు. తెలంగాణ వచ్చాక సింగరేణి మనుగడే ప్రశ్నార్థకంగా మారిందా అనే చర్చ సింగరేణి ప్రాంతంలో జోరుగా సాగుతోంది.



# క్యూఆర్ పరిధిలో లక్ష ‘ఇందిరమ్మ’ ఇండ్లు



గ్రామీణ ప్రాంతాలలో ఇందిరమ్మ ఇండ్లతో పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం, ఇప్పుడు అదే సంకల్పంతో క్యూఆర్ పరిధిలోని పేదల సొంతింటి స్వప్నాన్ని నిజం చేసేందుకు మరో చారిత్రాత్మక అడుగు వేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా క్యూఆర్ పరిధిలో దశల వారీగా లక్ష ఎల్.ఐ.జీ. ఇందిరమ్మ ఇండ్లను నిర్మించబోతున్నామని, ఇందుకు సంబంధించి ఇప్పటికే పరిపాలనా అనుమతులు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ఇవాళ సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూఆర్ పరిధిలో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇండ్లపై హౌసింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీన క్యూఆర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్ఐజీ ఇండ్ల పథకానికి శ్రీకారం చుడుతున్నామని ప్రకటించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్చార్జ్ మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, హైదరాబాద్ జిల్లా మంత్రి మహ్మద్ అజారుద్దీన్తో కలిసి పథకానికి సంబంధించిన విధివిధానాలను, దరఖాస్తుల ఆహ్వానం, అర్హతలు, టెండర్ల ప్రక్రియ, అమలు విధానం తదితర పూర్తి మార్గదర్శకాలను ప్రకటిస్తామని వివరించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో క్యూఆర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఎల్ఐజీ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తొలి దశలో పైలట్ ప్రాజెక్టుగా ప్రతి నియోజకవర్గానికి కనీసం 500 చొప్పున, ఆయా స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైన చోట వెయ్యి వరకు నిర్మిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. గత ప్రభుత్వం ఎలాంటి ముందుచూపు లేకుండా, హైదరాబాద్ నగరానికి 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో అక్కడక్కడ డబుల్ బెడ్రూమ్ ఇళ్లను నిర్మించడం వల్ల తమ జీవనోపాధి దెబ్బతింటుందని, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కోల్పోతామనే ఆందోళనతో చాలామంది అక్కడ నివసించలేకపోయారని అన్నారు. తమ ప్రభుత్వం మాత్రం పేదల జీవన వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని, వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే, వారి ఉపాధి, పిల్లల విద్య, వైద్య సౌకర్యాలు, రవాణా వంటి అంశాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నియోజకవర్గాన్ని యూనిట్గా తీసుకుని అత్యంత ముఖ్యమైన ప్రాంతాలలో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లను నిర్మిస్తోందని అన్నారు. ఆ స్థలంలో వారికి వాటా ఇస్తూ యాజమాన్య హక్కు కల్పిస్తూ వారి కుటుంబాలకు శాశ్వత ఆర్థిక భద్రతను కల్పిస్తున్నామన్నారు. క్యూఆర్ పరిధిలో హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్ మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నియోజకవర్గాలలో స్థలాలను గుర్తించడం జరిగిందని, ఈ స్థలాలను ఇప్పటికే హౌసింగ్ విభాగం పొజిషన్లోకి తీసుకుందని తెలిపారు. ఎక్కడ ఎన్ని ఇండ్లు, ఎన్ని అంతస్తులు నిర్మించాలి, ఒక్కో ప్లాట్ విస్తీర్ణం, బిల్డింగ్ డిజైన్లను సీఎం రేవంత్ రెడ్డి గారితో చర్చించి రెండు, మూడు రోజులలో తుది రూపును ఇస్తామని వెల్లడించారు.

# ప్రజా సంక్షేమం ఆపే ప్రసక్తే లేదు



ౕ, రాజోలి : పదేళ్ల పాటు రాష్ట్ర సంపదను దోచుకుని తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిన వారు మళ్లీ అధికారంలోకి వస్తామని చెబుతున్నారని, వచ్చి పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రద్దు చేయడానికేనా అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి మండలం జులేకల్ గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం తెలంగాణను రూ. 8.21 లక్షల కోట్ల అప్పులతో కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పగించిందని ఆరోపించారు. అయినప్పటికీ రెండున్నరేళ్లలో రూ. 2.08 లక్షల కోట్ల అసలు, వడ్డీ చెల్లిస్తూ ప్రజా సంక్షేమాన్ని ఏమాత్రం తగ్గించకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రాష్ట్రంలో ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ భీమా, వడ్డీలేని మహిళా రుణాలు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల వంటి పథకాలను నిరంతరంగా అమలు చేస్తున్నామని చెప్పారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం కోసం ఇప్పటికే ఆర్టీసీకి రూ. 12 వేల కోట్లు చెల్లించామని, కోటి 6 లక్షల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచామని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం, పాలు, రాగిజావ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసి అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యా సౌకర్యాలు కల్పిస్తున్నామని, హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మెటిక్ చార్జీలను 200 శాతం పెంచామని చెప్పారు. అదనంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి రూ. 22,500 కోట్లతో నిర్మాణాలు చేపడుతున్నామని, ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల ఇందిరమ్మ భీమా పథకాన్ని నవంబర్లో ప్రారంభిస్తామని వెల్లడించారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం రెండున్నరేళ్లలో డ్వాక్రా సంఘాలకు రూ. 76 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని తెలిపారు. అలంపూర్ నియోజకవర్గ అభివృద్ధిపై స్పందిస్తూ, మల్లమ్మకుంట రిజర్వాయర్కు అవసరమైన 573 ఎకరాల భూసేకరణను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్కు ఆదేశాలు జారీ చేస్తామని ప్రకటించారు. భూసేకరణ అనంతరం 87,500 ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల మద్దతు కొనసాగుతోందని భట్టి విక్రమార్క అన్నారు.

## ఎంపీడీవో విజయ్ కుమార్‌కు దేవస్థానం చైర్మన్ ఘన సన్మానం



**ఇల్లంతకుంట, జులై 14, (తెలంగాణ వాణి ప్రతినిధి) :**
ఇల్లంతకుంట మండలానికి ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) విజయ్ కుమార్‌ను శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్వామివారి మెమెంటోతో పాటు ముత్యాల తలంబ్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇంగిలే రామారావు మాట్లాడుతూ, ఇల్లంతకుంట మండల అభివృద్ధి, గ్రామాల పురోగతి, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం, ప్రజలకు మరింత మెరుగైన పరిపాలనా సేవలు అందించడంలో ఎంపీడీవో విజయ్ కుమార్ విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆయన పదవీ కాలం విజయవంతంగా సాగాలని కోరుతూ శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్త గొడిశాల పరమేష్, డీసీసీ కార్యదర్శి మేకమల్ల అశోక్, యూత్ కాంగ్రెస్ నాయకుడు ఉప్పుల అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నా

## అంగన్వాడి కేంద్రంలో నులిపురుగుల మాత్రల పంపిణీ



**నాగిరెడ్డిపేట మండలం జులై 14:( తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాగిరెడ్డి పేట మండలంలోని జలాల్పూర్ గ్రామంలో మంగళవారం రోజున అంగన్వాడి కేంద్రంలో నులిపురుగుల నివారణ మాత్రలను చిన్నారులకు పంపిణీ చేశారు . జాతీయ నిలుపులో దినోత్సవం పురస్కరించుకొని మాత్రలను పంపిణీ చేస్తున్నారు . ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరు నులిపురుగుల నివారణ మాత్రలను స్వీకరించాలని తెలిపారు . ఆరోగ్యమే మహాభాగ్యం కాబట్టి మాత్రమే స్వీకరించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు . ఇట్టి కార్యక్రమంలో భాగంగా గ్రామ కార్యదర్శి వెంకటరాములు , అంగన్వాడీ టీచర్లు ఆశ వర్కర్లు గ్రామస్తులు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు .

## ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ బి.ఎస్. లత
- రాయికల్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్



**జగిత్యాల: జులై 14 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాల జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ అమలును మంగళవారం రాయికల్ పట్టణంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించి, నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దరఖాస్తుదారులకు అవసరమైన సహాయం అందించాలని అధికారులకు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొంటున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రమాణాలను పాటిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ బి.ఎస్. లత సూచించారు.ఈ తనిఖీలో రాయికల్ తహసీల్దార్ నాగార్జున, ఎన్నికల విభాగం అధికారులు, బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి.. దేవరకొండలో ఏబీవీపీ కళాశాలల బంద్ విజయవంతం



**దేవరకొండ, జూలై 14 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం దేవరకొండ డివిజన్ పరిధిలోని పలు కళాశాలల్లో బంద్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో–కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత విద్యకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అత్యంత కీలకమని అన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కారణంగా వేలాది మంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడకుండా పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ఏబీవీపీ చేపడుతున్న ఉద్యమంలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి మహా ఉద్యమాన్ని చేపట్టి ప్రభుత్వాన్ని నిలదీస్తామని యలమల గోపీచంద్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంకూరి శ్రీకాంత్, నగర కార్యదర్శి పగిళ్ల విక్రమ్, నగర సంయుక్త కార్యదర్శి యలమల హేమసుందర్, దమోజు అమితేష్, గుండాల శివరామరాజు, వినయ్, బిట్టు, సాయి, అబ్దుల్లా, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత ఆకలింపు రావమ్మ వానమ్మ

- తల్లడిల్లుతున్న రైతన్న
- పెరుగుతున్న భానుడి భగభగ
- ఎల్నినో ఏలుతున్నట్టేనా ...?
- ప్రాజెక్టుల్లో తగ్గుతున్న జలం





**కామారెడ్డి జిల్లా జూలై 14 :(తెలంగాణ వాణి ప్రతినిధి)**
అల్లాడుతున్న రైతన్నకు వాన ఆసరైతదనుకుంటే ఆపదవుతుంది . అలమటిస్తున్న రైతన్నకు కనుకరించైనా కురువమ్మ వానమ్మ . భానుడి భగభగకు భగవంతుని తలువక తప్పట్లేదు . జూలై మాసకాలం గడిచే నాటికైనా వానమ్మ కనుకరిస్తుందని రైతన్న అలమటిస్తుండు . ఆపదలో ఉన్న రైతన్నకు బాసట కావలసిన వానమ్మ , బరువెక్కి హృదయాన్ని తలపిస్తుంది . వానా కాలం ప్రారంభమై ఒక మాసం గడిచినప్పటికీ ఒక్కటి కూడా పెద్ద వాన కురువకపాయే... ఎట్ల తీరునో రైతన్న గోస . ప్రాజెక్టులు నీరు లేక మైదానాలను తలపిస్తున్నాయి. జలాశయాల్లో నీరు లేక భూగర్భజలాలు అడుగంటుతున్నాయి . ఆకలితో అలమటిస్తున్న జీవరాశులకు కూడా అరిగడ్డి దొరకక ఆగమయితున్నాయి .
ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వర్షాల కాలంలో కూడా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది . రైతన్న ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నాను . కాలానికి తగ్గట్టు వర్షాలు కురవకపోవడంతో పంటల భవితవ్యంపై గందరగోళంలో పడ్డ రైతన్న . వర్షాలు కృషి పంటలు తండాలని గ్రామ గ్రామాన దేవుళ్ళకు వేడుకుంటున్నాను . కామారెడ్డి జిల్లాలో నాటికి తక్కువ శాతం వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు . జిల్లాలో ని పలు మండలాలలో సాధారణ వర్షపాతం నమోదైనప్పటికీ , పలు మండలాలలో లోటు వర్షపాతం నమోదైనట్లు తెలిపారు . జిల్లా మొత్తంలో 237. 7మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 172.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు అంచనా వేశారు . గత కాలంలో కురిసిన వర్షాపాతానికి -27% వ్యత్యాసంలో వర్షాపాతం నమోదైనట్లు తెలిపారు .
జిల్లాలోని పలు ప్రాజెక్టుల్లో నీటి సామర్థ్యం కన్నా అత్యధికంగా లోబడి ఉన్నట్లు అధికారులు తెలిపారు . నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం 1394.5 8 అడుగులకు చేరగా , నిజాంసాగర్ ఆయకట్టు నిల్వ సామర్థ్యం 17.802 కాగా ప్రస్తుతం 6. 556 టీఎంసీలకు పడిపోయినట్లు అధికారులు వెల్లడించారు . మరోవైపు వర్షాలు లేక అన్నదాతలు వర్షం కోసం మొరపెట్టుకుంటే 134 క్యూసెక్కుల నీరు లీకేజీలు ద్వారా వృధా అవుతుందని అధికారులు తెలిపారు . వర్షాలపైనే ఆధారపడిన ప్రాజెక్టు కింద రైతులు ఆందోళనకు గురవుతున్నారు . నిజాంసాగర్ ఆయకట్టును నింపే ప్రధాన కాలువ వెంట సాగు చేసే రైతులకు ఆందోళన కలిగిస్తుంది. గత వారం రోజుల నుండి నమోదు అవుతున్న ఎండ తీవ్రతకు ఉక్కిరి బిక్కిరి అవుతున్న జీవరాసులు. గత 24 గంటల్లో కామారెడ్డి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు కొల్లూరులో 38.2ఢి ఎ ఉష్ణోగ్రత నమోదయినట్లు అధికారులు వెల్లడించారు . ఆకాశం నిర్మానుషంగా మారి మేఘావృతం ఎప్పుడు అవుతుందో అని అన్నదాతలు ఎదురుచూస్తున్నారు .
ఎల్నినో ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు పూర్తిగా ఆందోళనను కలిగిస్తున్నాయి . ముఖం చాటేసిన వానలను చూస్తుంటే అన్నదాత విలవిల పోతున్నాడు. నీరు లేక పంట తీరం దెబ్బతింటున్నాయి . కళ్ళ ముందే నీరు అందక పచ్చని వంట ఎండిపోతుందని అన్నదాత ఆగమైపోతున్నాడు. ఎలాగైనా నారుమడులోనైనా కాపాడుకోవాలని శత విధాలుగా అన్నదాత కష్టపడుతున్నారు .

# పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్
- రూ.6.13 కోట్ల అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం



**జగిత్యాల: జులై 14 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాల మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ అధ్యక్షతన జూలై-2026 మాసానికి సంబంధించిన మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు.సమావేశానికి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో భాగంగా జగిత్యాల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వార్డుల వారీగా నిర్వహించిన స్వచ్ఛ భారత్ అవగాహన సదస్సులకు దేశవ్యాప్తంగా గుర్తింపు రావడం గర్వకారణమని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పాలకవర్గ సభ్యులు పార్టీలకు అతీతంగా సమిష్టిగా పనిచేసి జగిత్యాలను పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన పట్టణంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. పట్టణాన్ని ఆనుకుని ఉన్న చెరువులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న ఆయన, అమృత్ పథకం ద్వారా మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకుని వార్డుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు చురుకుగా పాల్గొని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ మాట్లాడుతూ, పట్టణంలో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు రూ.6.13 కోట్ల అంచనా వ్యయంతో వివిధ అభివృద్ధి పనుల ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలని కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో నిధులు త్వరగా మంజూరై అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు.ఇటీవల మున్సిపల్ కమిషనర్ పేరుతో జరిగినట్లు ఆరోపణలు ఉన్న ఫోర్జరీ ఆధారిత రిజిస్ట్రేషన్ వ్యవహారాన్ని పాలకవర్గం తీవ్రంగా ఖండిస్తోందని చైర్‌పర్సన్ తెలిపారు. విషయం తెలిసిన వెంటనే కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశారని, దర్యాప్తుకు మున్సిపాలిటీ పూర్తిస్థాయిలో సహకరిస్తుందని స్పష్టం చేశారు. ఈ ఘటనతో పాలకవర్గానికి ఎలాంటి సంబంధం లేదని పేర్కొంటూ, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.సమావేశంలో అన్ని వార్డులు, నూతన హౌసింగ్ కాలనీలలో రోడ్లపై గుంతలు పూడ్చడం, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జేసీబీలతో డ్రైన్లు, కాలువలు శుభ్రపరచడం, మున్సిపల్ పబ్లిక్ టాయిలెట్లను పూర్తిస్థాయిలో ప్రజల వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని నిర్ణయించారు.అనంతరం జాతీయ జల మిషన్ కార్యక్రమంలో భాగంగా సభ్యులందరూ జల ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఇంటా ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించి, నీటి సంరక్షణలో జగిత్యాలను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాలని కమిషనర్ సత్య ప్రణవ్ పిలుపునిచ్చారు. వార్డు సభ్యులు సమావేశంలో ప్రస్తావించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# 2027 గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు

- ధర్మపురి, కోటిలింగాల అభివృద్ధికి తొలి విడతలో రూ.117 కోట్లు
- దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా కనీవినీ ఎరుగని రీతిలో పుష్కరాలు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**జగిత్యాల: జులై 14 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
2027 గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించి దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా చేస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి ధర్మపురి, కోటిలింగాల పుణ్యక్షేత్రాల్లో పుష్కరాల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పుష్కరాల సందర్భంగా వీఐపీ, సాధారణ స్నాన ఘాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, బైపాస్ రోడ్లు, రహదారుల విస్తరణ, విద్యుత్, తాగునీరు, పార్కింగ్, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతుల ఏర్పాటుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, ఉగ్ర నరసింహస్వామి ఆలయం, కోటిలింగాల దేవస్థానాల్లో పునర్నిర్మాణ, పునరుద్ధరణ పనులను పరిశీలించిన మంత్రి, తొలి విడతలో ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు.మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని పేర్కొన్నారు. ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన కేబినెట్ ఉపసంఘం ఏర్పాటు చేసి బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరం వెంబడి ఉన్న ప్రధాన పుణ్యక్షేత్రాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.గోదావరి పుష్కరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.1,000 కోట్లు కేటాయించగా, ధర్మపురి--కోటిలింగాల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం, రహదారుల విస్తరణ, ఆలయాల అభివృద్ధి, భక్తులకు మౌలిక వసతుల కల్పన కోసం తొలి విడతలో రూ.117 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ధర్మపురి అభివృద్ధికి అదనంగా రూ.50--60 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని మంత్రి చెప్పారు. ఇందులో సంతోషీమాత ఆలయానికి అనుసంధానంగా వంతెన నిర్మాణం, ప్రత్యేక వీఐపీ ఘాట్, కోటిలింగాల ఆలయం సమీపంలో డబుల్ రోడ్డు నిర్మాణం వంటి పనులు ప్రతిపాదించినట్లు వివరించారు.భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడంలో ఎలాంటి రాజీ ఉండదని, గోదావరి పుష్కరాలను విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.ప్రజలందరూ ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, దేవాలయ ఈవో, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌లు, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు, మున్సిపల్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి, దేవాదాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సంరక్షణకు అధునాతన ఆవిష్కరణలు

### గీతం చర్చాగోష్ఠిలో పేర్కొన్న స్వదేశీ, విదేశీ పరిశ్రమ నిపుణులు



**పటాన్ చెరు, జూలై 14, (తెలంగాణ వాణి రిపోర్టర్):**
ప్రపంచ ఆరోగ్య సవాళ్లను పరిష్కరించడానికి అధునాతన మెటీరియల్స్, నూతన చికిత్సా పరిష్కారాల ఆవిష్కరణను రసాయన, జీవశాస్త్ర ఆవిష్కరణలు నడిపిస్తున్నాయని పరిశ్రమ నిపుణులు పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదు లోని స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'పదార్థాల నుంచి ఔషధాల వరకు: రసాయన, జీవ శాస్త్రాల పాత్ర' అనే అంశంపై మంగళవారం ఒకరోజు చర్చా గోష్ఠిని ఏర్పాటు చేశారు. ఆరోగ్య సంరక్షణ, బయోమెడికల్ సైన్సెస్ ను అభివృద్ధి చేయడంలో రసాయన, జీవ శాస్త్రాలు పోషిస్తున్న కీలక పాత్రపై చర్చించడానికి ప్రఖ్యాత శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, పరిశోధకులు, విద్యార్థులను ఒకచోట చేర్చిన ఈ కార్యక్రమంలో పారిస్ లోని రెన్నెస్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ రెన్ గ్రే, ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ చాడ రాజిరెడ్డి విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ప్రపంచ ఆరోగ్య సవాళ్లను పరిష్కరించడంలో రసాయన, జీవ శాస్త్రాల ప్రధాన భూమికను వారు వివరించారు. ప్రొఫెసర్ రెన్ గ్రే నూతన కైనేస్ ఇన్హిబిటర్ల ఆవిష్కరణ, ఔషధ రసాయన శాస్త్రంలో సుస్థిరతపై మాట్లాడారు. మానవ కైనోమ్ లో 538 ప్రోటీన్ కైనేసులున్నాయని, ఇమాటినిబ్, సోరాఫెనిబ్, సునిటినిబ్ సహా దాదాపు వంద ఎఫ్డీఏ ఆమోదిత ప్రోటీన్ కైనేస్ ఇన్హిబిటర్లు (పీకేఐలు) అందుబాటులో ఉన్నాయని, వాటిలో సుమారు 85 శాతం క్యాన్సర్ చికిత్సకు ఉపయోగిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం 400కు పైగా కైనేస్ ఇన్హిబిటర్లు క్లినికల్ అభివృద్ధి దశలో ఉన్నాయని, ఇది 9.8 శాతం వార్షిక వృద్ధి రేటుతో, సుమారు 64 బిలియన్ల పౌండ్ల విలువైన వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్ కు ప్రాతినిధ్యం వహిస్తోందన్నారు. గీతం విశిష్ట ఆచార్యుడు, డీఎస్టీ పూర్వ కార్యదర్శి డాక్టర్ శ్రీవారి చంద్ర శేఖర్ మాట్లాడుతూ, శాస్త్రీయ ఆవిష్కరణలు వేగవంతం చేయడానికి, పరిశోధనలను అర్థవంతమైన సామాజిక ప్రయోజనాలుగా మార్చడానికి రసాయన, జీవ శాస్త్రాలతో పాటు పదార్థ విజ్ఞాన శాస్త్రాల మధ్య అంతర్ విభాగ సహకారాన్ని పెంపొందించాల్సి ఉందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా మాట్లాడుతూ, అత్యాధునిక పరిశోధలను ప్రోత్సహించడానికి, అర్థవంతమైన శాస్త్రీయ పరస్పర చర్యలకు వేదికలను సృష్టించడంలో గీతం నిబద్ధతను చాటిచెప్పారు. సంక్లిష్టమైన శాస్త్రీయ, ఆరోగ్య సంరక్షణ సమస్యలను పరిష్కరించ ‍డానికి బహుళ విభాగాల విధానాలను అవలంబించాలని ఆయన విద్యార్థులు, పరిశోధకుల ను ప్రోత్సహించారు. ఈ సెమినార్ లో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పదార్థ విజ్ఞాన శాస్త్రం, ఔషధ రసాయన శాస్త్రం, జీవ పరిశోధనలలో అభివృద్ధి చెందుతున్న పోకడలపై నిపుణుల ఉపన్యాసాలు, ఆసక్తికరమైన చర్చల నుంచి వారు ప్రయోజనం పొందారు. ఈ కార్యక్రమాన్ని రసాయన శాస్త్ర విభాగానికి చెందిన డాక్టర్ గౌసియా బేగం, డాక్టర్ ఎ.రత్నమాల సమన్వయం చేశారు.

## ఈశ్వరమ్మ యాదవ్‌పై వ్యాఖ్యలు ఖండనీయం..

### శివచరణ్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి: దొంతరవేన రమేష్ యాదవ్

**జమ్మికుంట, జూలై 14 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలిగా నియమితులైన పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌పై యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి చేసినట్లు ఆరోపించబడుతున్న అనుచిత వ్యాఖ్యలను ఉప సర్పంచ్‌ల ఫోరం జమ్మికుంట మండల అధ్యక్షుడు దొంతరవేన రమేష్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసీ మహిళను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌కు, యాదవ సామాజిక వర్గానికి, బీసీ సమాజానికి జక్కిడి శివచరణ్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే బీసీ సంఘాల ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, అవసరమైతే ఆయన నివాసాన్ని ముట్టడించి నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఎలాంటి వ్యాఖ్యలనైనా సహించబోమని, బీసీ సమాజం ఐక్యంగా స్పందించి తగిన సమాధానం ఇస్తుందని దొంతరవేన రమేష్ యాదవ్ పేర్కొన్నారు.

## నారాయణఖేడ్ ఎంపీడీవో, కల్హేర్ ఎంపీ ఓల సస్పెండ్

**సంగారెడ్డి :నారాయణఖేడ్, జూలై 14 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించారని నారాయణఖేడ్ ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, కల్హేర్ ఎంపీఓ కృష్ణకుమార్ లను, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు, ఈనెల 8న కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష సమావేశం నిర్వహించగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరు కావడంతో కలెక్టర్ వీరిద్దరిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## స్ఫూర్తికి" పీపుల్స్ యువసేన చేయూత



**ధర్మారం, జులై 14(తెలంగాణ వాణి )**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని స్ఫూర్తి మానసిక వికలాంగుల పాఠశాలకు పీపుల్స్ యువసేన చేయూతనిచ్చింది. స్ఫూర్తి మానసిక వికలాంగుల పాఠశాలకు పీపుల్స్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు మేకల సంజీవరావు ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, నిత్యవసర వస్తువులతో పాటుగా పండ్లను అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. అనంతరం సంజీవరావు మాట్లాడుతూ యువత పలు సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వహించాలని భారతదేశం పట్ల ప్రజల పట్ల సామాజికంగా బాధ్యతగా ఉండాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా స్ఫూర్తి మానసిక వికలాంగుల పాఠశాలను నిర్వహిస్తున్న యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం యొక్క ప్రాముఖ్యతను యువతకు చాటు చెప్పే విధంగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో 19వ సారి సంజీవరావు రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో పీపుల్స్ యువసేన పెద్దపల్లి మండల ఉపాధ్యక్షులు ఏలువాక రమేష్, జంగ కుమార్, బండి సుమన్, మహేందర్, స్ఫూర్తి నిర్వాహకులు మొగిలి, ఉపాధ్యాయులు సౌజన్య, శారద,సురేష్ పాల్గొన్నారు.

## బోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఆదిలాబాద్, జులై : 14 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**

పాఠశాలల్లో ఉపాధ్యాయులు వినూత్న సాంకేతిక సాధనాలను ఉపయోగించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని తిరుపెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్రం, బొక్కల్ గూడ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గెజిటెడ్ నంబర్ -2)లో ఆంగ్ల భాష సబ్జెక్టు లపై ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'శిక్షా కో-పైలట్' సాఫ్ట్‌వేర్ పై నిర్వహించిన 3 రోజుల శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా ఉపాధ్యాయులు సులభంగా పాఠ్యాంశాల ప్రణాళికను తయారు చేసుకోవచ్చని, అందుకు సంబంధించిన వీడియోలను, అదనపు సమాచారాన్ని పొంది విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించవచ్చని తెలిపారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారిని డిజిటల్ బోధన ద్వారా తరగతి గదుల్లో భాగస్వాములను చేయాలన్నారు. ఫిజికల్ సైన్స్, ఆంగ్లం ఉపాధ్యాయులు నిత్య జీవితంలో జరిగే అంశాలను, క్రీడలను శాస్త్ర సాంకేతికతతో ముడిపెట్టి బోధించాలని సూచించారు. ఉపాధ్యాయులు పొందిన శిక్షణ వివరాలను, పాఠశాల భద్రతా ప్రణాళికలను యూ-డైస్ ప్లస్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. అలాగే, గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని 10% పెంచాలని, నిర్దేశిత లక్ష్యాలను సాధించడానికి కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఎంఈఓలు నిరంతరం సమీక్షలు జరపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి మాధవి, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం పోడు భూముల సమస్యల పరిష్కారం

### -జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల,జులై 14 (తెలంగాణ వాణి):**



ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టంకు లోబడి పోడు భూముల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని కోటపల్లి మండలం ఎడగట్ట గ్రామంలో నిబంధనలను అతిక్రమించి సాగు చేస్తున్న అటవీ భూములను జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, కోటపల్లి సి.ఐ. కృష్ణ, అటవీ డివిజనల్ అధికారి సర్వేశ్వర్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టానికి లోబడి పోడు భూముల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. చట్టం ప్రకారం 2005 కు ముందు సాగులో ఉండి పట్టా పొందిన అర్హులైన గిరిజన రైతులకు మాత్రమే చట్టం వర్తిస్తుందని తెలిపారు. చట్ట ప్రకారం 2005 నాటికి 75 సంవత్సరాలు కాస్తులో ఉండి పట్టా పొందిన గిరిజనేతరులకు మాత్రమే అవకాశం ఉంటుందని, 2005 తర్వాత నూతనంగా అటవీ భూములు సాగు చేస్తున్న వారు చట్ట పరిధిలోకి రారని తెలిపారు. అనర్హులు, నూతనంగా అటవీ భూములను సాగు చేయకుండా స్థానికులు అర్థమయ్యేలా వివరించాలని తెలిపారు. ఇట్టి భూములకు సంబంధించి చెన్నూర్ అటవీ రేంజ్ కార్యాలయంలో మ్యాప్ అందుబాటులో ఉందని, సందేహాలు ఉన్నవారు మ్యాప్ ను పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుడిసెలు లేని గ్రామాలే తీర్చిదిద్దటమే లక్ష్యం

- మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులు వెంటనే మొదలుపెట్టాలి
- నిజమైన అర్హులను గుర్తించి ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇందిరమ్మ ఇల్లు అందించాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్

**నర్సాపూర్/ కొల్చారం/ వరిగుంతం / జులై14 (తెలంగాణ వాణి ప్రతినిధి )**



ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి అర్హులైన కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు కొల్చారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని హౌసింగ్ పీడీ మాణిక్యం తాసిల్దార్ శ్రీనివాస చారి ఎంపీడీవో రహీం మున్నీసా బేగం, సర్పంచ్ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ముందుగా రెండో విడతలో ప్రాధాన్యతనిచ్చే గుడిసెల ధ్రువీకరణ, మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, రెండో విడత లబ్ధిదారుల ఎంపిక సంబంధిత వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో పారదర్శకత, జవాబుదారీతనం, వేగం ఉండేలా అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేసే దిశగా సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. మొదటి విడతలో మంజూరై సంవత్సరం కావస్తుందని ఇప్పటికీ ప్రారంభించని లబ్ధిదారుల విషయంలో ఇండ్లు మొదలుపెట్టే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రెండో విడత కూడా జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం మంజూరు అవుతుంది కాబట్టి మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల పథకం లక్ష్యాలను సాధించాలన్నారు. జిల్లాలో మొదటి విడతలో 9వేల ఇండ్లు మంజూరు కాగా ఇందిరమ్మ ఇండ్ల పురోగతి 83% పూర్తయిందని ఇప్పటివరకు 1700 ఇండ్లు నిర్మాణం పూర్తి చేసుకుని గృహప్రవేశం చేయడం జరిగిందన్నారు.2400 ఇండ్లు స్లాబ్ పూర్తి చేసుకుని ఫెన్సింగ్ దశలో ఉన్నాయన్నారు 650 ఇండ్లు రూమ్ లెవెల్లో ఉన్నాయన్నారు.1400 ఇండ్లు బేస్ మెంట్ లెవెల్లో ఉన్నాయన్నారు మిగతా ఇండ్లు పునాది దశలో ఉన్నాయని తెలిపారు ఇప్పటివరకు 1600 ఇండ్లు లబ్ధిదారులు ఇంకను మొదలు పెట్టలేదని త్వరితగతిన మొదలుపెట్టే విధంగా అవగాహన కల్పించాలన్నారు. దారిద్య రేఖకు దిగువన ఉండి నిరుపేద కుటుంబాల వారికి మహిళా సంఘ గ్రూపుల ద్వారా రుణాలు మంజూరు చేసి ఇండ్లు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పథకంలో భాగంగా జిల్లాలో గుడిసెల సర్వే పూర్తయిందని తెలిపారు. గుడిసెల్లో నివాసం ఉండే వారికి మొదటి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం లక్ష్యాలకు అనుగుణంగా. ముందుకు సాగే విధంగా అధికారుల కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో వ్యూహాత్మక నైపుణ్యం అవసరం

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
- సివిల్, ఆర్డ్స్ రిజర్వ్, క్యూఆర్‌టీ బలగాలకు

'మాబ్ ఆపరేషన్ డ్రిల్'పై ప్రత్యేక శిక్షణ

**జగిత్యాల: జూలై 14 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



శాంతిభద్రతలను సమర్థవంతంగా పరిరక్షించడం, అత్యవసర పరిస్థితుల్లో పోలీసు బలగాలు సమన్వయంతో వేగంగా స్పందించేలా తీర్చిదిద్దే లక్ష్యంతో జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ గ్రౌండ్‌లో సివిల్ పోలీసు, ఆర్మ్డ్ రిజర్వ్ (ఏఆర్), క్విక్ రెస్పాన్స్ టీమ్ (క్యూఆర్‌టీ) సిబ్బందికి 'మాబ్ ఆపరేషన్ డ్రిల్'పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ అల్లర్లు, నిరసనలు, సామూహిక ఘర్షణలు వంటి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితుల్లో పోలీసులు చట్టబద్ధంగా, సంయమనంతో, వ్యూహాత్మకంగా వ్యవహరించే నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం అత్యంత అవసరమన్నారు. ప్రతి పరిస్థితిని ముందుగానే అంచనా వేసి తగిన వ్యూహంతో స్పందించాలని, ఉద్రిక్త పరిస్థితుల్లో సంయమనం పాటిస్తూనే చట్టబద్ధంగా అల్లరి మూకలను అదుపులోకి తీసుకురావాలని సూచించారు.నిరంతర సాధన ద్వారానే క్లిష్ట పరిస్థితుల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించగలమని పేర్కొన్న ఎస్పీ, ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు పోలీసు సిబ్బందిలో వృత్తి నైపుణ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి శిక్షణలను తరచుగా నిర్వహిస్తామని వెల్లడించారు. శిక్షణలో భాగంగా అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. లాఠీ డ్రిల్, అల్లరి మూకలను చెదరగొట్టే సమయంలో లాఠీచార్జ్ నిర్వహించే విధానం, గ్యాస్ గన్ వినియోగ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. అలాగే ఆకస్మిక దాడుల సమయంలో స్వీయ రక్షణతో పాటు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంపై మాక్ డ్రిల్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వేణు, సైదులు, ఇన్‌స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్, కరుణాకర్, రాజకుమార్, లక్ష్మీనారాయణ, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అమావాస్య సందర్భంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి హోమం



**రాజాపేట జూలై: 14(తెలంగాణ వాణి విలేఖరి)**

మండల కేంద్రంలోని శ్రీగిరి సంకల్ప సిద్ధి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి హోమం, వరాహ స్వామి హోమం, మంగళవారం రోజున కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా కన్నుల పండగగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ యాజమాన్యం సభ్యులు సూది రెడ్డి నాగిరెడ్డి కళావతి, కుంభాల ఎల్లారెడ్డి శోభారాణి, కూర బద్రీనాథ్ కళ్యాణి, సమ్మెట రాఘవేంద్ర మంజుల, వట్టం శ్రీనివాస్ రాజేశ్వరి చుట్టు ముట్టు గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా కన్నుల పండుగగా నిర్వహించారు.

## సర్ ప్రక్రియను పరిశీలించిన ఎమ్మార్వో



**డిండి జులై 14( తెలంగాణ వాణి ప్రతినిధి)**

సర్‌లో భాగంగా డిండి మండలం పెద్ద తండా గ్రామ పంచాయతీలో డిండి మండల ఎమ్మార్వో హన్మంత్ శ్రీనివాస్ గౌడ్ సార్ ప్రక్రియను పరిశీలించారు. ఓటర్ నమోదు ప్రక్రియను పరిశీలించారు బి ఎల్ ఓ, బిఎల్ఏ కి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డిండి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యాల శశిధర్ రెడ్డి , బిఎల్ఏ రమేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఆకతాయిల ఆట కట్టించిన 'షీ' టీం

### -డెకాయ్ ఆపరేషన్‌లో ఐదుగురు పట్టివేత

### కౌన్సిలింగ్ నిర్వహించిన: ఎస్ఐ హైమ

**మంచిర్యాల, జూలై 14 (తెలంగాణ వాణి):**




మహిళలు, బాలికలు, విద్యార్థినుల భద్రతకు భంగం కలిగించే ఆకతాయిలపై జిల్లా షీ టీం ఉక్కుపాదం మోపుతోంది. ప్రజా ప్రదేశాల్లో మహిళలను వేధిస్తూ, వెకిలి చేష్టలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్న షీ టీం, మంగళవారం జిల్లా కేంద్రంలోని రాముని చెరువు పార్క్‌లో నిర్వహించిన డెకాయ్ ఆపరేషన్‌లో ఐదుగురు ఆకతాయిలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని వారికి కౌన్సిలింగ్ నిర్వహించింది.ఈ సందర్భంగా జిల్లా షీ టీం ఎస్ఐ హైమ మాట్లాడుతూ, ప్రజా ప్రదేశాల్లో మహిళలు, విద్యార్థినులు నిర్భయంగా సంచరించేలా షీ టీం నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. మహిళలను ఇబ్బందులకు గురిచేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాముని చెరువు పార్క్‌లో కొంతకాలంగా వెకిలి చేష్టలు జరుగుతున్నాయనే సమాచారంతో ప్రత్యేకంగా డెకాయ్ ఆపరేషన్ నిర్వహించగా, మహిళలను వేధిస్తున్న ఐదుగురిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు.పట్టుబడిన యువకులకు పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించి, భవిష్యత్తులో ఇటువంటి అసాంఘిక చర్యలకు పాల్పడవద్దని గట్టిగా హెచ్చరించినట్లు పేర్కొన్నారు. మళ్లీ ఇలాంటి ఘటనల్లో పాల్గొంటే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మహిళలు, బాలికలు, విద్యార్థినులు ఎక్కడైనా ఆకతాయిల వేధింపులు, అసభ్య ప్రవర్తన లేదా అనుమానాస్పద సంఘటనలు ఎదురైన వెంటనే డయల్--100కు లేదా రామగుండం షీ టీం వాట్సాప్ నంబర్ 6303923700కు సమాచారం అందించాలని ఎస్ఐ హైమ సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.మహిళల భద్రతే షీ టీం ప్రధాన లక్ష్యమని, పాఠశాలలు, కళాశాలలు, పార్కులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు తదితర రద్దీ ప్రాంతాల్లో నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు. మహిళల భద్రత విషయంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ డెకాయ్ ఆపరేషన్‌లో జిల్లా షీ టీం సభ్యులు శ్రవణ్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## జువ్వాడిని కలిసిన నాచుపల్లి వెలమ సంక్షేమ మండలి ప్రతినిధులు



**జగిత్యాల: జులై 14 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ను కోడిమ్యాల మండలం నాచు పల్లి వెలమ సంక్షేమ మండలి ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు జువ్వాడి నరసింహారావును శాలువతో సత్కరించి సన్మానించారు. మెట్పల్లి పట్టణంలోని జువ్వాడి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో నాచుపల్లి వెలమ సంక్షేమ మండలి అధ్యక్షుడు సురభి ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శి గంద్ర ప్రమోద్ రావు, తోపాటు పైడిపల్లి సత్యనారాయణ రావు, సుగుణరావు, ఎస్ శ్రీనివాస్ రావు, జె.లక్ష్మన్ రావు, ఎం శ్రీనివాస్ రావు, సురేందర్ రావు, వెంకట్ రావు పాల్గొన్నారు.

## పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలి

తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీని వెంటనే ప్రకటించి, సీపీఎస్‌ను రద్దు చేయాలని తపస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తపస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా పీఆర్‌సీ ప్రకటించక పోవడం, డీఏ బకాయిలు విడుదల చేయకపోవడం ఉద్యోగులు, ఉపాధ్యాయులను నిరాశకు గురిచేస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీతో పాటు ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్‌ను పూర్తిగా రద్దు చేయాలని కోరారు. అలాగే 317 జీవో వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగులకు న్యాయం చేయాలని, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిపోయిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియను వెంటనే చేపట్టాలని, కోరారు.

## ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య అందించాలి

- సానుకూలంగా స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్.
- హర్షం వ్యక్తం చేసిన ప్రెస్ క్లబ్ కార్యవర్గం.

**నిజామాబాద్ జులై14: (తెలంగాణ వాణి ప్రతినిధి)**



అర్హులైన జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 100 శాతం ఉచిత విద్య అందించాలని ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పంచ రెడ్డి శ్రీకాంత్, వాగ్మారే సుభాష్ లు కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల జిల్లాకు విచ్చేసిన విద్యా శాఖ కార్యదర్శి యోగితా యోగితా రాణ కు ఉచిత విద్య అందించాలని ప్రెస్ క్లబ్ కార్యవర్గం కలిసి విన్నవించారు . ఈ వినతిపై స్పందించిన ఆమె జిల్లా విద్యాశాఖ అధికారికి ఆదేశించడం జరిగింది. కాగా సెలవు పై ఉన్న డీఈవో విధుల్లోకి వచ్చిన సందర్భంగా మంగళవారం ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఆధ్వర్యంలో కలిసి ఉచిత విద్యా అందించాలని విన్నవించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ స్పందిస్తూ.. ఒకటి రెండు రోజుల్లో జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య అందేలా చూస్తానని, ఇతర జిల్లాలలో ఉన్న ప్రొసీడింగ్ ను పరిశీలించి నిజామాబాద్ జిల్లాలో కూడా ఉచిత విద్య అందేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సతీష్, కమిటీ సభ్యులు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాలకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు

### కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్, జూలై 14 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**



వచ్చే ఏడాది జూన్, జూలై మాసాలలో జరుగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. గోదావరి పుష్కరాలు-2027 ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి మంగళవారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర కన్సల్టెంట్ కుహూ గుప్తాతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గోదావరి పరీవాహక ప్రాంతాలైన తుంగిని, పోచంపాడ్, తడ్ పాకల్ పుష్కర ప్రదేశాల వద్ద చేపట్టాల్సిన పనులు, కల్పించాల్సిన వసతులపై చర్చించారు. శ్రీరాంసాగర్ రిజర్వాయర్ తో కూడిన పోచంపాడ్ పుష్కరఘాట్ వద్ద పుణ్య స్నానాలు ఆచరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు వీ.ఐ.పీలు, వీ.వీ.ఐ.పీలు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున వాహనాల పార్కింగ్, సరైన రోడ్డు వసతి, అత్యవసర ఎగ్జిట్ వంటి అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. తడ్ పాకల్, తుంగిని పుష్కరఘాట్ల వద్ద కూడా అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి తేవాలన్నారు. పుష్కర ఘాట్ల వరకు అప్రోచ్ రోడ్లు, పుష్కర ఘాట్ల మరమ్మతులు వంటి పనులను ప్రాధాన్యతాక్రమంలో చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. నిర్దేశిత పుష్కర ఘాట్లను క్షేత్రస్థాయిలో సందర్శించి, ఇప్పటికే ఆమోదం తెలిపిన పనులు వెంటనే ప్రారంభం అయ్యేలా చూడాలని, అవసరమైన కొత్త పనులను గుర్తిస్తూ ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. సమీక్షా సమావేశంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, ఎండోమెంట్ తదితర శాఖల పాల్గొన్నారు.

## మైనార్టీ కళాశాల తరలింపును వెంటనే నిలిపివేయాలి

### బీఆర్ఎస్ నేత ఆదిమూలం సతీష్



**ఎల్లారెడ్డి, జూలై 14 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎల్లారెడ్డిలోని మైనార్టీ వెల్ఫేర్ కళాశాలను లింగంపేట్‌కు తరలించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఆర్డీవో ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్ కుమార్ మాట్లాడుతూ, గత ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం మంజూరు చేసిన విద్యాసంస్థలను ప్రస్తుత ప్రభుత్వం ఇతర ప్రాంతాలకు తరలించడం బాధాకరమన్నారు. మైనార్టీ వెల్ఫేర్ కళాశాలతో పాటు గతంలో మంజూరైన పాలిటెక్నిక్ వ్యవసాయ కళాశాలను కూడా యథాస్థానాలకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని కళాశాలను తిరిగి ఎల్లారెడ్డికి తీసుకురాకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఏగుల నర్సింలు, గంగారెడ్డి, బర్కత్, అమీర్, ఇమ్రాన్, శ్రవణ్, అరవింద్ గౌడ్, దయాకర్, బబ్లు, దేవదాస్, నారాయణ, యూనుస్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీల్లో నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, జూలై 14 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం దస్తురాబాద్, కడెం మండలాల్లో పర్యటించి కేజీబీవీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను పరిశీలించారు. కేజీబీవీల్లో విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించారు. వసతి గృహాలు, విద్యార్థుల హాజరు, భోజన నాణ్యతను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. విద్యార్థులతో క్విజ్ నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి పెన్నులు బహుమతిగా అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రి రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పురోగతిని సమీక్షించి, గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు పర్యటనలో డీఈవో భోజన్న, డీఎంహెచ్‌వో రాజేందర్, తహసీల్దార్లు, ఎంఈవోలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డు ఆస్తులను రక్షించాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ కు వినతి

**భువనగిరి జూలై: 14(తెలంగాణ వాణి విలేకరి)**



యాదాద్రి భువనగిరి జిల్లాలోని వక్ఫ్ బోర్డు ఆస్తులను, స్థలాలను రక్షించాలని, అసుర్ ఖాన పీర్ల కొట్టంల అభివృద్ధికి నిధులు మం జూరు చేయాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్ కు భువనగిరి షియా కమిటీ సెక్రటరీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భువనగిరి షియా కమిటీ సెక్రటరీ సయ్యద్ కల్బ్ హుస్సేన్ అబెది మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలోని విలువైన వక్ఫ్ భూముల, స్థలాల రక్షణ కోసం ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. జిల్లాలోని చారిత్రాత్మక అషూర్ ఖానాల (పీర్లకొట్టం ) పునరుద్ధరణతో పాటు దర్గాలు మసీదుల పరిధిలో ఉన్న ఎంతో విలువైన వక్ఫ్ ఆస్తులను కాపాడటం చాలా ముఖ్యం అని ఆయన అన్నారు. ప్రస్తుతం అనేక విలువైన వక్ఫ్ భూములను కొందరు భూ ఆక్రమదారులు కబ్జాలకు పాల్పడుతున్నారని ఆయన తెలిపారు. జిల్లాలో భూ బకాసురులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని శిథిలావస్థకు చేరుకుంటున్న పురాతన అషూర్ ఖానాలను రక్షించేందుకు వెంటనే నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. వక్ఫ్ బోర్డు నిర్లక్ష్యం వల్లే ఇవి ఖండ్రాలుగా మారుతున్నాయని, వక్ఫ్ బోర్డు అధికారులు జిల్లాల్లో పర్యటించి, రెవెన్యూ శాఖతో కలిసి వక్ఫ్ భూములపై సమగ్ర సర్వే నిర్వహించి విలువైన ఆస్తుల రక్షణకు తగిన చర్యలు చేపట్టాలని సయ్యద్ కాల్బ్ హుస్సేన్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ ను కోరారు.

## మంచినీటి సమస్యను తీర్చిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే



**ఎల్లారెడ్డి జులై 14 తెలంగాణ వాణి ప్రతినిధి**
ఎల్లారెడ్డి మున్సిపల్ లో 5 వార్డు గండిమాసానిపేట్ లో మంచి నీటి కొరత ఉందని గ్రామస్థులు ఎల్లారెడ్డి శాసన సభ్యులు మదన్ మోహన్ కు తెలియజేయడంతో వెంటనే స్పందించి నూతన బోరు బావి వేయించి మోటార్ స్టార్టర్ అందజేసి గ్రామస్థులకు మంచినీటి సమస్య లేకుండా చేయడం జరిగింది గ్రామస్థులు ఎల్లారెడ్డి శాసన సభ్యులు మదన్ మోహన్ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ కమిషనర్ జగ్జీవన్ వార్డు కౌన్సిలర్ అట్కరి చంద్రయ్య మరియు వివిధ వార్డుల కాన్సిలర్ లు కోప్షన్ మెంబెర్స్ లు అబ్దుల్ వహీద్ వసీం గ్రామ కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ వెంకటేశం ముకీద్ సతీష్ శివరాములు జంగ,శంకర్ పుట్ల రాములు కుచులకంటి,శంకర్ సాయగౌడ్ నరేష్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# తాగునీటిని వృధా చేస్తే జరిమానా విధింపు

### కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి

**నిజామాబాద్, జూలై 14 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఎక్కడ కూడా తాగునీరు వృధా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరైనా తాగునీటిని వృధా చేస్తే జరిమానాలు విధించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లో రూ. 10 వేలు, గ్రామ పంచాయతీల పరిధిలో రూ. 5వేల జరిమానా విధించాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం తాగునీటి సరఫరా, సాగునీటి లభ్యత, భూగర్భ జలాల పెంపుదల తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రధాన జలాశయాలైన నిజాంసాగర్, శ్రీరాంసాగర్ రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, తాగు, సాగునీటి అవసరాలకు అవి ఏమేరకు సరిపోతాయి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావం వల్ల ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నందున, అందుబాటులో ఉన్న నీటి వనరులను ఎంతో జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేకించి తాగునీటిని ఏమాత్రం వృధా చేయకుండా, భవన




నిర్మాణాలు వంటి ఇతర అవసరాలకు మళ్లించకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. ఎక్కడైనా తాగునీటిని వృధా చేస్తే, బాధ్యులకు జరిమానాలు విధించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అన్ని నివాస ప్రాంతాలకు, ప్రజల అవసరాలకు సరిపడా రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్, ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులు అన్ని నివాస ప్రాంతాలలో తాగునీటి సరఫరా స్థితిగతులను పరిశీలించి సంయుక్తంగా సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించారు. వర్షపు నీటిని ఒడిసిపడుతూ, భూగర్భ జలాలు వృద్ధి చెందేలా అవకాశం ఉన్న చోట ఫాంపాండ్స్, ఇతర వాటర్ షెడ్ నిర్మాణాలు జరిపించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ముఖ్యంగా గ్రౌండ్ వాటర్ లెవెల్స్ పడిపోయిన చోట, నీటి వనరుల లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాలలో ప్రాధాన్యత క్రమంలో వీటి నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. ఎక్కడ కూడా తాగునీటి విషయమై ప్రజలు ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. అదేవిధంగా ఖరీఫ్ పంటల సాగుకు ఆయా ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు అవసరమైన మొదటి, రెండు తడులు నీటిని అందించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి ప్రకాశ్, ఆర్.డబ్ల్యూ.ఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాలను యువత సద్వినియోగపరుచుకోవాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్, జులై : 14 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
జిల్లా యువత జాబ్ మేళాల సద్వినియోగ పరచుకొని ఉపాధి అవకాశాలను పొందాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎస్టీయూ భవన్లో జిల్లా ఉపాధి కల్పన శాఖ, శ్రీ అష్టాలక్ష్మి స్పిన్నింగ్ మిల్ సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ జాబ్ మేళా కు దాదాపు 1000 మందికి పైగా అభ్యర్థులు హాజరై తమ పేర్లను నమోదు చేసుకున్నారని, స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు లభించడం ప్రధాన కారణమని వెల్లడించారు. అష్టలక్ష్మి స్పిన్నింగ్ మిల్స్ యాజమాన్యం తమను సంప్రదించి, పరిశ్రమలో ఉన్న ఖాళీల వివరాలను తెలపడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. టెక్స్టైల్ పరిశ్రమలలో టెక్నీషియన్లు, సూపర్‌వైజర్లు, ఫిట్టర్లు, ఆపరేటర్లు వంటి వివిధ విభాగాల్లో నిరంతరం మ్యాన్‌పవర్




అవసరం ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ పరిశ్రమలో వందలాది మంది మహిళలు ఎంతో సురక్షితమైన, అనుకూలమైన వాతావరణంలో షిఫ్టుల వారీగా విజయవంతంగా పనిచేస్తున్నారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ జాబ్ మేళా ద్వారా ఎంపికైన అభ్యర్థులకు సంస్థ తరపున ఆరు నెలల పాటు ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు వివరించారు. ఏ ఉద్యోగంలోనైనా శిక్షణ అనేది అత్యంత కీలకమైన భాగమని, ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు ఎదురైనా అభ్యర్థులు ఆసక్తితో, కష్టపడి, ఇష్టపడి పని నేర్చుకోవాలని సూచించారు. ఆరు నెలల శిక్షణ కాలంలో అభ్యర్థులు చూపే ప్రతిభ, వారి పనితీరు ఆధారంగా ఉద్యోగాలను పర్మనెంట్ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. జిల్లాలో యువతకు ఉపాధి కల్పించేందుకు ఈ ఏడాది ఇప్పటికే 4 లేదా 5 జాబ్ మేళాలు నిర్వహించామని, ఈరోజు అవకాశం రాని అభ్యర్థులు నిరాశ పడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో స్థానిక కంపెనీలతో కలిసి మరిన్ని జాబ్ మేళాలు నిర్వహిస్తామని, యాజమాన్యాలు ముందుకు వస్తే జిల్లా యంత్రాంగం నుండి వంద శాతం మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం పలువురికి నియామక పత్రాలను కలెక్టర్, మున్సిపల్ చైర్ పర్సన్ అందజేశారు. అదేవిధంగా ఈ జాబ్ మేళా విజయవంతంగా నిర్వహించినందుకు అధికారులను, స్పిన్నింగ్ మిల్ ప్రతినిధులను కలెక్టర్ శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ జాబ్ మేళాలో జిల్లా ఉపాధి కల్పన అధికారి మిల్కా, అష్టాలక్ష్మి స్పిన్నింగ్ మిల్ ప్రతినిధులు విక్రాంత్ కేతన్, గణేష్, ఇతర అధికారులు, యువత, నిరుద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాంతక వ్యాధికి అరుదైన శస్త్ర చికిత్స

- తల్లి, బిడ్డల ప్రాణాలను కాపాడిన సోమాజిగూడ యశోద ఆస్పత్రి వైద్యులు.
- సమావేశంలో వివరాలు వెల్లడించిన డాక్టర్ జి. విక్రమ్ కుమార్.

**నిజామాబాద్ జులై 14( తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతున్న ఒక యువ గర్భిణీ కీ సకాలంలో వైద్యం అందించి రెండు ప్రాణాలను కాపాడగలిగామని సోమాజిగూడ యశోద హాస్పిటల్ కన్సల్టెంట్ క్లినికల్ హెమటాలజిస్ట్ అండ్ బీఎంటీ ఫిజీషియన్, డాక్టర్ జి. విక్రమ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని యశోద మెడికల్ సెంటర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన యువ గర్భిణికి ప్రాణాంతకమైన థ్రోంబోటిక్ థ్రోంబోసైటోపెనిక్ పర్పు రా (టీటీపీ ) అనేఅరుదైన, రక్తసంబంధిత వ్యా ధితో బాధపడుతుండగా, సకాలంలో వ్యాధిని గుర్తించి వైద్యం అందించడం జరిగిందన్నారు. పేషెంట్ అత్యంత విషమ పరిస్థితిలో ఆసుపత్రిలో చేరగా, ఆసుపత్రిలోని మల్టీడిసిప్లినరీ బృందం వేగంగా స్పందించి వ్యా ధిని నిర్ధారించిందన్నారు. తక్షణమేఅత్యవసర చికిత్సను అందించి,తల్లి, గర్భస్థశిశువు ఇద్దరికీ ఎలాంటి ప్రాణాపాయం లేకుండా భద్రత కల్పించిదన్నారు. హెమటాలజీ బృందం వెంటనేవ్యా ధిని నిర్ధారించి, టీటీపీ కిఅంతర్జాతీయంగా ఆమోదించబడిన అత్యుత్తమ చికిత్స అయినథెరప్యూ టిక్ ప్లాస్మా ఎక్స్ఛేంజ్ (ప్లాస్మా ఫెరిసిస్) ను, కార్టికోస్టెరాయిడ్ థెరపీతో కలిపి వెంటనే ప్రారంభించమన్నారు. పేషెంట్ ఈచికిత్సకు అద్భుతంగా స్పందించిన్నట్లు పేర్కొన్నారు , ఆమె ప్లేట్లెట్ కౌంట్ వేగంగా కోలుకొని మొత్తం ఆరోగ్యం నిలకడగామారిందన్నారు. హెమటాలజీ ప్రసూతి బృందాల నిరంతర పర్యవేక్షణలో ఆమె గర్భం సురక్షితంగా కొనసాగుతోం దన్నారు. ,ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నారన్నారు. "థ్రోంబోటిక్ థ్రోంబోసైటోపెనిక్ పర్పు రా అనేది అరుదైన కానీ ప్రాణాంతకమైన మెడికల్ఎమర్జెన్సీ . చికిత్స చేయకపోతే ఇదిచాలా




వేగంగా తీవ్రమవుతుందన్నారు . గర్భధారణ సమయంలో తల్లి, బిడ్డ ఇద్దరినీరక్షించడానికి,వ్యాధిని ముందుగా గుర్తించడం, వేగంగా నిర్ధారించడం తక్షణం థెరప్యూటిక్ ప్లాస్మా ఎక్స్ ఛేంజ్ ప్రారంభించడం చాలా ముఖ్యం అని సకాలంలో నిపుణుల జోక్యంసమన్వయంతో కూడిన మల్టీడిసిప్లినరీకేర్ విజయవంతమైన ఫలితాలను సాధించడంలో ఎంత ముఖ్యమో ఈ కేసుస్పష్టం చేస్తుందని అన్నారు. టీటీపీ అనేది ఒక అరుదైన రక్తసంబంధ వ్యాధి అని ఇందులో శరీరం అంతటా చిన్న చిన్న రక్తపు గడ్డలు ఏర్పడతాయన్నారు. దీనివల్లప్లేట్లెట్ కౌంట్ తీవ్రంగా పడిపోవడం, ఎర్రరక్తకణాలు నాశనం కావడం, మెదడు, మూత్రపిండాలు ,గుండెవంటి ముఖ్యమైన అవయవాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంటుందన్నారు. గర్భధారణ సమయంలో ఇతర సమస్యలలక్షణాలు ఈ వ్యాధి లక్షణాలు ఒకేలా ఉండటం వల్ల, ఈ వ్యా ధిని గుర్తించడం సవాలుతో కూడుకున్నదన్నారు. కాబట్టివ్యాధిని త్వరగా గుర్తించడం మరింత కీలకం. ఈ విజయవంతమైన ఫలితం, అత్యాధు నాతన రోగనిర్ధారణ పద్ధతులు, థెరప్యూ టిక్ ప్లాస్మా సౌకర్యాలు సమన్వయంతో కూడిన మల్టీడిసిప్లినరీకేర్ ద్వార సంక్లిష్టమైన హెమటాలాజికల్ ఎమర్జెన్సీ లను నిర్వహించడంలోసోమాజిగూడ యశోద హాస్పిటల్ కు ఉన్న అత్యుత్తమ నైపుణ్యా న్ని ప్రతిబింబిస్తుందన్నారు. ఈ సమావేశంలో సీనియర్ మార్కెటింగ్ మేనేజర్ రూపేష్ షిండే, సీనియర్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎం. అమర్నాథ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్సీ, పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలి: తపస్ జిల్లా శాఖ



**ఎల్లారెడ్డి, జూలై 14 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర పిలుపు మేరకు జగిత్యాల కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీ, ఆరు పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తపస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు భూనేకర్ సంతోష్ మాట్లాడుతూ, మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలతో పాటు 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఆర్థిక నష్టం కలగకుండా పీఆర్సీ, డీఏలను వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర నాయకులు రాఘవరెడ్డి, రవీంద్రనాథ్ ఆర్య, రమేష్ కుమార్, భాస్కరాచారి, రంగారావు తదితరులు 2003 డీఎస్సీ ఉద్యోగులకు ఓపీఎస్ అమలు, సీపీఎస్ రద్దు, కేజీబీవీ, సమగ్ర శిక్ష, మోడల్ స్కూల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, 317 బాధితులకు న్యాయం, టెట్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తిచేయాలి

### పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం జూలై :14 జిల్లా బ్యూరో (తెలంగాణ వాణి )**
పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తిచేసి అభియోగపత్రాన్ని నిర్ణీత గడువులోగా న్యాయస్థానంలో సమర్పించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. మంగళ వారం జిల్లా పోలీస్ అధికారుల నేరసమీక్ష సమావేశం పోలీస్ కాన్ఫిరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నేర విచారణలో నిందితులకు శిక్షల శాతం పెరగడం అత్యంత ముఖ్యమని, దీనికోసం పకడ్బందీ దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, పోలీసు-ప్రాసిక్యూషన్ సమన్వయం అవసరమన్నారు. కొత్త చట్టాల ప్రకారం నిర్ణీత గడువులోగా ట్రయల్ పూర్తి చేయాలని, సాక్షులు భయపడకుండా భరోసా కల్పిస్తూ న్యాయస్థానానికి హాజరయ్యేలా చూడాలన్నారు. ఎన్డీపీఎస్ కేసులో న్యాయస్థానంలో నేరాన్ని రుజువు చేయడానికి ఆయా కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి / మాదకద్రవ్యాల స్వభావం,పరిమాణాన్ని శాస్త్రీయంగా నిర్ధారించే ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీ నివేదిక ప్రధాన ఆధారమని అన్నారు. అదేవిదంగా జిల్లాలో గంజాయి రవాణా,విక్రయాలను అరికట్టడానికి స్పెషల్ దృష్టి పెట్టాలని,ఈగల్ బృందాలు,టాస్క్ ఫోర్స్, స్థానిక పోలీసుల సమన్వయంతో మూలలను కనిపెట్టాలని అన్నారు. వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని



ఆదేశించారు. చోరీల నివారణకు, దొంగిలించబడిన సొత్తును బాధితులకు తిరిగి అప్పగించడానికి పోలీసులు సాంకేతికతను ఉపయోగిస్తూ రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టాలాని, నిందితుల గుర్తింపు, రికవరీ వేగవంతం చెయాలన్నారు. విచారణలో భాగంగా ప్రతి కేసు ను సాంకేతిక ఆధారాలు, ఫోరెన్సిక్ సాక్ష్యాలు, డిజిటల్ సాక్ష్యాలను సమర్థవంతంగా వినియోగించి దర్యాప్తు చేపట్టాలని సూచించారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండ కూడదని స్పష్టం చేస్తూ...నేరాలు జరిగిన తరువాత స్పందించడం కంటే..ముందస్తు నివారణ చర్యలు తీసుకోవడమే సమర్థవంతమైన పోలీసింగ్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత సమర్థ వంతంగా అమలు చేయాలని సూచించారు. శాంతిభద్రతలు,నేరాల ధోరణి, పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్, పోలీసింగ్‌లో సాంకేతిక



పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే హాట్‌స్పాట్‌లు లేదా బ్లాక్ స్పాట్‌లలో ప్రాణనష్టాన్ని నివారించ డానికి రోడ్డు భద్రతా చర్యలు, ఇంజనీరింగ్ మార్పులు,కఠినమైన ట్రాఫిక్ నియంత్రణలు చాలా ముఖ్యన్నారు. ప్రమాదకర మలుపులు,కూడళ్ల వద్ద స్పష్టమైన సైన్‌బోర్డులు, బ్లింకర్స్, స్పీడ్ బ్రేకర్లు, రంబిల్ స్ట్రిప్స్, గరిష్ఠ వేగపరిమితి సూచికలు పెట్టడం, రాత్రి సమయంలో స్పష్టత కోసం సోలార్ లైట్లు,వీధి దీపాలు మెరుగుపరచడం. గుంతలను పూడ్చడం, జారుడు రోడ్లకు తగిన గుర్తులు వేయడం వంటి చర్యలు సంబంధిత అధికారుల సమన్వయంతో ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ రామానుజం,ఏసీపీలు వసుందర యాదవ్, రమణమూర్తి,తిరుపతి రెడ్డి, సారంగపాణి, ఫణిందర్,నర్సింహారావు, సర్వర్, సత్యనారాయణ, సాంబరాజు పాల్గొన్నారు...

## బాలికల కళాశాలలో ర్యాగింగ్ నిరోధంపై న్యాయ అవగాహన కార్యక్రమం




**ఖమ్మం, జూలై 14 (తెలంగాణ వాణి):**
జిల్లా న్యాయ సేవా సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి పీ. దేవి మానస ఆధ్వర్యంలో ఖమ్మంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రభుత్వ ఎస్ఆర్జేసీ (బాలికల) కళాశాలలో ర్యాగింగ్ నిరోధంపై న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ర్యాగింగ్ చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని, వేధింపులకు గురైన విద్యార్థినులు వెంటనే కళాశాల యాజమాన్యం, యాంటీ ర్యాగింగ్ కమిటీ లేదా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యాసంస్థల్లో సురక్షితమైన, స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పేందుకు ప్రతి విద్యార్థి బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. అనంతరం విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేశారు. యువతులు విద్య, నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి సారించి ఆత్మవిశ్వాసంతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## రైతు సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం వద్దు

- సాగునీరు, విద్యుత్, గిట్టుబాటు ధర కల్పించాలి
- డిమాండ్లు నెరవేర్చకపోతే ఆందోళన తప్పదు
- రైతు కూలీ సంఘం నాయకురాలు లతక్క హెచ్చరిక.



**ఏటూరునాగారం,జులై14(తెలంగాణ వాణి):**
రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సాగునీటి సరఫరాలో జాప్యం,విద్యుత్ కోతలు,ఎరువులు విత్తనాల కొరతతో పాటు పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు మంగళవారం ఏటూరునాగారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జగదీష్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు కూలీ సంఘం నాయకురాలు లతక్క మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను పూర్తిగా మరిచిపోయింది. ఖరీఫ్ సీజన్ వచ్చినా కాలువలకు నీరు లేదు. 9గంటల కరెంటు అంటారు కానీ 3గంటలు కూడా సరిగా రావడం లేదు. ఎరువులు,విత్తనాల కోసం గంటల కొద్దీ క్యూలో నిలబడాలి. పండించిన పంటకు కనీస ధర కూడా ఇవ్వడం లేదు. రుణభారంతో రైతు ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలి. లేకుంటే మేము రోడ్డెక్కక తప్పదు.” ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని, పాత రుణాల భారం కారణంగా రైతులు కొత్త రుణాలు తీసుకోలేక సతమతమవుతున్నారని చెప్పారు. ధాన్యంతో పాటు ఇతర పంటలకు కూడా కనీస మద్దతు ధర కల్పించి, కొనుగోలు కేంద్రాలను గ్రామస్థాయిలో ఏర్పాటు చేయాలని కోరారు.రైతులకు అవసరమైన ప్రభుత్వ సహాయాన్ని తక్షణమే అందించాలని, పంట నష్టపరిహారం, బీమా సొమ్ము వెంటనే చెల్లించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. రైతాంగ సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తమ డిమాండ్లు పరిష్కారం కాకపోతే సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## బాలానగర్ ఎస్ఐఆర్ ను పరిశీలించినా డిప్యూటీ తహసీల్దార్ లిఖితారెడ్డి



**బాలానగర్ జులై14 (తెలంగాణ వాణి ప్రతినిది )**
బాలానగర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ (ా×=) ప్రక్రియను వేగవంతం చేయాలని డిప్యూటీ తహసీల్దార్ లిఖితారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు పోలింగ్ బూత్‌లను ఆమె పరిశీలించి, ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బూత్‌ల వారీగా నమోదైన పని శాతాన్ని పరిశీలించారు. బూత్ నంబర్ 78లో బీఎల్ఓ సుజాత 54.72 శాతం, 79లో కమల 46.56 శాతం, 80లో జరీనా బేగం 52 శాతం, 81లో మంజుల 47.62 శాతం ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. బాలానగర్ గ్రామంలోని నాలుగు బూత్‌లలో ఇప్పటివరకు 46.56 శాతం నుంచి 54.72 శాతం వరకు ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్డీవో కార్యాలయ ఆవరణలో సహాయక కేంద్రం




**వనపర్తి : జులై 14, ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయ ఆవరణంలో 78-వ శాసనసభ నియోజకవర్గ ప్రజలకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (గణన ఫారం) నింపడంలో ఏమైనా అనుమానాలు ఉన్నచో అట్టి అనుమానాలు నివృత్తి చేసుకొనుటకు ఎస్ ఐ ఆర్ ఫారం నింపుటకు సహకరించుటకుగాను రాజస్వ మండలాధికారి ఓటరు నమోదు అధికారి వనపర్తి కార్యాలయం ఆవరణలో సహాయక కేంద్రము (హెల్ప్ డెస్క్) ఏర్పాటు చేయనైనది. కావున ఓటరు నమోదు ఎస్ఐఆర్ ఫారం పూరించుటకు ఇట్టి సదుపాయమును 78 వ శాసనసభనియోజకవర్గ ప్రజలందరూ కూడా సద్వినియోగం చేసుకొనగలరని తెలియజేయడమైనది.

# అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే భరోసా

- రూ.3.5 లక్షల మేర నష్టం వాటిల్లిందన్న పండ్ల వ్యాపారి
- నష్టం వివరాలపై అధికారులకు నివేదిక పంపనున్నట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెల్లడి

**వనపర్తి : జూలై 14, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో బోలెమోని రాధమ్మకు చెందిన పండ్ల దుకాణంలో సోమవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో భారీ ఆస్తి నష్టం సంభవించింది. ప్రమాదం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మంగళవారం ఘటనాస్థలికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా



అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ప్రమాదంలో సుమారు రూ.3.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు ఎమ్మెల్యేకు వివరించారు. బోలెమోని రాధమ్మ కుటుంబం 15 సంవత్సరాలుగా పండ్ల వ్యాపారంపైనే ఆధారపడి జీవనం సాగిస్తోందని, ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మధు మాట్లాడుతూ, జరిగిన నష్టాన్ని అంచనా వేసి పూర్తి వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని వెల్లడించారు. ప్రభుత్వం నుంచి అందే ఆర్థిక సాయం కోసం అవసరమైన ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు ఎమ్మెల్యేతో పాటు ఘటనాస్థలిని సందర్శించి పరిశీలించారు.

## 40 ఏళ్ల కాంగ్రెస్‌కు గుడ్‌బై.. బీఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలు



**వనపర్తి, జూలై 14 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త పానుగంటి రాము 40 ఏళ్ల పార్టీ అనుబంధానికి ముగింపు పలికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమక్షంలో తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమై ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని విమర్శించారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, కార్మికులు, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, రైతు బీమా, ఎరువుల కొరత, విద్యుత్ సమస్యలు, ధాన్యానికి గిట్టుబాటు ధర వంటి అంశాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేసిన తమలాంటి కార్యకర్తలను కాంగ్రెస్ నాయకత్వం విస్మరించిందని, అందుకే నియోజకవర్గ అభివృద్ధి నిరంజన్ రెడ్డి నాయకత్వంలోనే సాధ్యమనే నమ్మకంతో బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పానుగంటి రాముతో పాటు గోర్ల రాము, కొమ్ము నాగయ్య, గార్ల రాము, కురుమయ్య, భగవంతు, నరేష్, అభిషేక్, చరణ్ తదితరులకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వాకిటి శ్రీధర్, మాణిక్యం, ధర్మానాయక్, మహేశ్వర్ రెడ్డి, చిట్యాల రాము, ధర్మశాస్త్రి, భగవంతు యాదవ్, శంశుద్దీన్, అంజి, సత్యనారాయణచారి తదితరులు పాల్గొన్నారు.

## టేకులపల్లిలో నూతన తహసిల్దార్ కార్యాలయానికి స్థల పరిశీలన

**టేకులపల్లి, జూలై 14 (తెలంగాణ వాణి):**
ప్రభుత్వం మంజూరు చేసిన నూతన తహసిల్దార్ కార్యాలయ భవన నిర్మాణంలో భాగంగా మంగళవారం హౌసింగ్ శాఖ అధికారులు టేకులపల్లిలో స్థల పరిశీలన నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న తహసిల్దార్ కార్యాలయ ఆవరణలోనే నిర్మాణానికి అనువైన స్థలాన్ని తహసిల్దార్ ఎల్. వీరభద్రం అధికారులకు చూపించగా, హౌసింగ్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాయిరాం, డీఈ ఖలీల్, జేఈ గణేష్ తదితరులు స్థలాన్ని పరిశీలించి ప్రాథమిక కొలతలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.263.25 కోట్లతో 107 తహసిల్దార్ కార్యాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాలుగు కార్యాలయాలు ఆమోదం పొందాయి. త్వరలోనే టేకులపల్లిలో అత్యాధునిక వసతులతో నూతన



తహసిల్దార్ కార్యాలయ నిర్మాణం ప్రారంభమవుతుందని తహసిల్దార్ ఎల్. వీరభద్రం తెలిపారు.

## జూలూరుపాడులో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా సీఈఓ నాగలక్ష్మి



**జూలూరుపాడు, జూలై 14 (తెలంగాణ వాణి):**
జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి బి. నాగలక్ష్మి మంగళవారం జూలూరుపాడు మండలంలోని పలు గ్రామాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు.మాచినేనిపేట తండా, అన్నారుపాడు, పాపకొల్లు గ్రామాల్లో ఓటర్లతో మాట్లాడిన ఆమె, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవడంతో పాటు మార్పులు, చేర్పులు, తొలగింపులు గడువులోగా పూర్తి చేసుకోవాలని సూచించారు.అనంతరం వివో భవనాల నిర్మాణాలు, డ్రైన్లు, సోక్‌పిట్లు, ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన గ్రావెల్ రోడ్లు, మొక్కల పెంపకం తదితర అభివృద్ధి పనులను పరిశీలించి నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనల ఎంపీడీవో తాళ్లూరి రవి, ఎంపీవో తులసిరామ్, ఏపీవో రామారావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## నేర నియంత్రణలో రాజీ వద్దు : ములుగు ఎస్పీ సుధీర్ రామ్నాథ్




**ములుగు, జూలై 14 (తెలంగాణ వాణి):**
జిల్లా పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్ పోలీసు అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. దొంగతనాలు, గంజాయి అక్రమ రవాణా, మాదకద్రవ్యాల వినియోగం, గుడుంబా, కల్తీ మద్యం, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామస్థాయిలో బలమైన ఇన్ఫార్మర్ వ్యవస్థ ఏర్పాటు చేసి, గస్తీ, వాహనాల తనిఖీలు, సీసీ కెమెరాల ఏర్పాటు పెంచాలని ఆదేశించారు. కోర్టు విచారణలో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించి, నేరస్తులకు శిక్ష పడేలా పటిష్టమైన సాక్ష్యాధారాలు సమర్పించాలని సూచించారు. అలాగే పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేసి, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకంగా విధులు నిర్వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## ఎస్ఐఆర్ ఫారాల డిజిటలైజేషన్ గడువులోగా పూర్తి చేయాలి : కలెక్టర్ దివాకర్ టీఎస్



**ఖమ్మం, జూలై 14 (తెలంగాణ వాణి):**
ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో స్వీకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను ఈ నెల 24లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అధికారులను ఆదేశించారు.మంగళవారం కూసుమంచి మండలంలో బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఫారాల పంపిణీ, సేకరణ, డేటా ఎంట్రీ, డిజిటలైజేషన్ పురోగతిని పరిశీలించారు. ప్రతి అర్హుడైన ఓటరికి నమోదు అవకాశం కల్పించి, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఏలు, వాలంటీర్ల సహకారంతో ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని, ప్రతి ఇంటిని సందర్శించి వంద శాతం ఫారాల సేకరణ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.



## తెలంగాణ రాజ్యాధికార పార్టీ కమలాపూర్ మండల అధ్యక్షుడిగా నాగపూరి రవీందర్ గౌడ్ నియామకం



**కమలాపూర్ తెలంగాణ వాణి ప్రతినిధి ( జులై 14 )**
తెలంగాణ రాజ్యాధికార పార్టీ ( టీఆర్పీ ) కమలాపూర్ మండల నూతన అధ్యక్షుడిగా కన్నూర్ గ్రామానికి చెందిన నాగపురి రవీందర్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకటేష్ గౌడ్ ఆయనకు అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బత్తిని వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యలపై పోరాడటానికి నాగపురి రవీందర్ నాయకత్వం ఎంతో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ స్థాయి నుండి పార్టీని బలిష్టమైన శక్తిగా తీర్చి దిద్దాలని ఆయన పిలుపునిచ్చారు. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నాగపురి రవీందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జిల్లా నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ప్రతి ఇంటికీ పార్టీ ఆశయాలను తీసుకెళ్తానని, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బోడ రంజిత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గోవింద జనార్ధన్, మరియు మండల పరిధిలోని ముఖ్య నాయకులు, పాల్గొన్నారు.

## చాణిక్య అంత్యక్రియల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు



**వనపర్తి : జూలై 14, (తెలంగాణ వాణి ప్రతినిధి )**
వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన బీజేపీ దళిత మోర్చా పట్టణ అధ్యక్షులు, మాజీ జిల్లా దళిత మోర్చా అధ్యక్షులు ఆకుపోగు కుమారస్వామి కుమారుడు ఆకుపోగు చాణిక్య అకాల మరణం పార్టీ శ్రేణులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. చాణిక్య అంత్యక్రియల్లో బీజేపీ వనపర్తి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ పాల్గొని, ఆయన భౌతిక కాయానికి బీజేపీ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ చాణిక్య చిన్న వయస్సులోనే పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ, ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొని జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకుల అభిమానాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని, ఆయన సేవలను ఎప్పటికీ స్మరించుకుంటామని అన్నారు. అనంతరం పెద్ద ఎత్తున బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మిత్రబృందం, స్నేహితులు, అభిమానులు పాల్గొన్న శోకయాత్ర నిర్వహించి అంతిమ యాత్రలో భాగస్వాములయ్యారు. చాణిక్యకు ఘనంగా వీడ్కోలు పలుకుతూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు. ఈ అంత్యక్రియల్లో బీజేపీ జిల్లా, మండల, పట్టణ నాయకులు, దళిత మోర్చా నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

### ఎంపీడీవోకు వినతిపత్రం



**అశ్వరావుపేట, జూలై 14 (తెలంగాణ వాణి):**
ములకలపల్లి మండలంలో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరుతూ మండల కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ సురభి రాజేష్, పొగళ్లపల్లి సర్పంచ్ మడకం రవి మంగళవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని 34 పోలింగ్ కేంద్రాల్లో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ఇప్పటివరకు 44 శాతం మాత్రమే పూర్తైందని, గడువు తక్కువగా ఉన్నందున ప్రతి గ్రామపంచాయతీలో చాటింపు వేయించి ప్రజాప్రతినిధులు, యువకుల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు సాదం శ్రీనివాస్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గుంటూరు సాయి పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య, చెత్త సేకరణ కార్మికులకు కిట్లు పంపిణి



**అశ్వరావుపేట జూలై 14 (తెలంగాణ వాణి)**
నమస్తే దినోత్సవ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం పిలుపుమేరకు అశ్వరావుపేట పురపాలక సంఘం కార్యాల యంలో పారిశుద్ధ్య కార్మికులు మరియు చెత్త సేకరించే కార్మి కులకు పి పికిట్ల పంపిణీ కార్యక్ర మం నిర్వహించారుఈ కార్యక్రమం అశ్వరావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ దిలీప్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి ఈ పథకం పారిశుద్ధ్య కార్మికులు మరియు చెత్త సేకరించే ప్రవేట్ కార్మికులు ఆరోగ్య భద్రత కల్పించడమే ప్రధాన లక్ష్యంగా నిర్వహించడం జరుగుతుంది స్పష్టం చేశారు పారిశుద్ధ్య కార్మికులు విధి నిర్వహణలో ప్రత్యేక జాగ్రత్త లు పాటించాలని తెలియజేశారు అందులో భాగంగానే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పీపీ కిట్లు అందజే యడం జరిగిందని తెలియజేశా రు కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే వారి కుటుంబాలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు నిత్యం కార్మికులు శ్రమించడం ద్వారానే గ్రామ మరియు పట్టణ ప్రాంతాలు సంపూర్ణ ఆరోగ్యంతో విరజిల్లుతాయని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కట్ట సింధుజ, దండ బత్తుల ఆదిలక్ష్మి, షేక్ రహేన కొట్టే నాగ సునీత, షేక్ నూర్జహాన్ మిండా హరిబాబు జినుగు రవికుమార్ చిన్నంశెట్టి శ్రీను తిరుమల శెట్టి వెంకన్న బాబు కో ఆప్షన్ సభ్యురాలు తగరం నిర్మల పమిడి లక్ష్మణరావు మున్సిపల్ కార్యాలయం సిబ్బంది మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## ఎస్ఐఆర్‌ను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలి

### కలెక్టర్ హేమంత్ సహదేవరావు

**ములుగు, జూలై 14 (తెలంగాణ వాణి):**



ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పిలుపునిచ్చారు. జిల్లాలోని 2,36,970 మంది ఓటర్లలో ఇప్పటివరకు 1,46,583 ఎన్యుమరేషన్ ఫారాలు (61.86 శాతం) డిజిటలైజ్ అయ్యాయని, మిగిలిన 38.14 శాతం ఫారాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. బీఎల్ఓలు ప్రతి ఇంటిని సందర్శించి ఫారాల పంపిణీ, సేకరణ చేపట్టడంతో పాటు రోజువారీగా డిజిటలైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. బీఎల్ఏలు, రాజకీయ పార్టీలు, ప్రజలు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు.

## జోన్-4 పోలీస్ డ్యూటీ మీట్‌లో భద్రాద్రి పోలీసులకు 12 పతకాలు



**అశ్వరావుపేట, జూలై 14 (తెలంగాణ వాణి):**
జోన్-4 పోలీస్ డ్యూటీ మీట్--2026లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది 3 స్వర్ణ, 7 రజత, 2 కాంస్య పతకాలతో మొత్తం 12 పతకాలు సాధించి జిల్లా ప్రతిష్ఠను చాటారు. కొత్తగూడెం--1 టౌన్ సీఐ ఎం. కరుణాకర్ రెండు స్వర్ణ, ఒక రజత, ఒక కాంస్య పతకం సాధించగా, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎస్కే నాగుల్ మీరా స్వర్ణ పతకం అందుకున్నారు. అశ్వరావుపేట సీఐ పి. నాగరాజు రెడ్డి సహా పలువురు అధికారులు, సిబ్బంది వివిధ విభాగాల్లో రజత, కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పతక విజేతలను అభినందిస్తూ, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## సమాచార వ్యవస్థను పటిష్టం చేసి నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి : ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్, జూలై 14 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ నేరాల నియంత్రణకు సమాచార వ్యవస్థ (ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్)ను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. గంజాయి, ఆన్‌లైన్ గేమింగ్, జూదం, అక్రమ బియ్యం రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసులో శాస్త్రీయ ఆధారాలతో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, బ్లూ కోల్ట్ బృందాల రాత్రి గస్తీ, మహిళల భద్రత, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గత ఆరు నెలలుగా జిల్లాలో శాంతిభద్రతలు కాపాడిన పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.

## కాంగ్రెస్ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి

### నూతన మండల అధ్యక్షులకు మాజీ ఎమ్మెల్యే జి.విట్టల్ రెడ్డి అభినందనలు

**నిర్మల్ - భైంసా: జూలై 14 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నూతనంగా నియమితులైన మండల అధ్యక్షులకు మాజీ ఎమ్మెల్యే జి.విట్టల్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు,రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి,జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు.ముధోల్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యువజన, మహిళా కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు నూతన మండల అధ్యక్షులకు పూర్తి సహకారం అందించి పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి కార్యకర్త భాగస్వామ్యమై అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని విట్టల్ రెడ్డి సూచించారు.

# నిరుద్యోగుల మహా ధర్నాకు సిపిఎం సంపూర్ణ మద్దతు

**తల్లాడ, జులై 14 (తెలంగాణ వాణి):**
మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో మన్నేపల్లి రామారావు అధ్యక్షతన పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు మాచర్ల భారతి హాజరై మాట్లాడుతూ, ఈ నెల 15న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిరుద్యోగులు చేపట్టనున్న మహా ధర్నాకు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత 12 సంవత్సరాలుగా నిరుద్యోగులను మోసం చేస్తున్నాయని ఆమె విమర్శించారు. 2014లో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు ఆ హామీని అమలు చేయకపోగా కోటికి పైగా ఉద్యోగాలను తొలగించిందని ఆరోపించారు. అలాగే గత టీఆర్ఎస్ ప్రభుత్వం "నీళ్లు--నిధులు--నియామకాలు" పేరుతో అధికారంలోకి వచ్చి నిరుద్యోగులను పూర్తిగా విస్మరించిందని, నిరుద్యోగ భృతి కూడా అమలు చేయకుండా మోసం చేయడంతో ప్రజల ఆగ్రహానికి గురై అధికారాన్ని కోల్పోయిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల హామీలను అమలు చేయకుండా నిరుద్యోగులను నిరాశపరుస్తోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే యూత్ డిక్లరేషన్ అమలు చేసి, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, ప్రతి సంవత్సరం ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వంపై ఉద్య మాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 15న ఇందిరా పార్కు వద్ద నిర్వహించే నిరుద్యోగుల మహా ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్, డివిజన్ కార్యదర్శి సేలం సత్యనారాయణ రెడ్డి, మండల కార్యదర్శి అయి నాల రామలింగేశ్వరరావు, నల్లమౌతు మోహన్‌రావు, షేక్ మస్తాన్, ముచ్చింతల చెన్నయ్య, రాజబోయిన సైదులు, చల్లా నాగేశ్వరరావు, పారాసాని వెంకటయ్య, పులి వెంకట నరసయ్య, మేడి బిక్షం తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్య తెలంగాణ రాష్ట్ర నిర్మాణమే అంతిమ లక్ష్యం

- పేద, మధ్య తరగతి ప్రజలకు కొండంత అండ సీఎం సహాయనిధి
- అభివృద్ధి, సంక్షేమశీ కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుంది
- తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు



**కోరుట్ల:జూలై 14(తెలంగాణ వాణి)**
ఆరోగ్య తెలంగాణ రాష్ట్రశీ నిర్మాణమే అంతిమ లక్ష్యంగా పేద,మధ్య తరగతి ప్రజలకు కొండంత అండగా సీఎం సహాయ నిధి నిలుస్తోందని, అభివృద్ధి, సంక్షేమశీ కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. కోరుట్ల పట్టణ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కోరుట్ల పట్టణ, మండలానికి మంజూరైన రూ. 9 లక్షల 54 వేల 500 విలువ గల 23 చెక్కులను కోరుట్ల మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్, కోరుట్ల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో లబ్ధిదారులకు తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పోరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు అందించారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు ప్రజా సంక్షేమశీ, అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 9 లక్షల 54 వేల 500 విలువగల 23 చెక్కులను లబ్ధిదారులకు అందించామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఇప్పటివరకు సుమారు రూ.7కోట్ల 50 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందించామని అన్నారు. అనారోగ్య సమస్యతో ఆస్పత్రిలో చేరి వైద్య ఖర్చు నిమిత్తం ఖర్చైన డబ్బులను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తూ ఆరోగ్యవంత మైన సమాజాన్ని నిర్మించడశీ లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నారని జువ్వాడి నర్సింగరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మండల కాంగ్రెస్ అధ్య క్షులు, కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజి రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులు అందించే కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కూనంనేనిపై ఫిర్యాదు వార్త పూర్తిగా అవాస్తవం

- ఛానల్లో వచ్చిన దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నా
- ఎస్ఐఆర్ ప్రక్రియపైనే మీనాక్షితో చర్చించాం
- కాంగ్రెస్ అభివృద్ధి కార్యక్రమాలను వివరించాం
- ప్రభుత్వంలో సిపిఐ, కాంగ్రెస్ కలిసి ఉన్నాయి
- ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి

**కొత్తగూడెం, జూలై 14 (తెలంగాణ వాణి)**
కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుపై తాను కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఓ ప్రముఖ ఛానల్‌లో వచ్చిన వార్త పూర్తిగా అవాస్తమని, సదరు దుష్ప్రచారాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వార్త ఛానల్లో ప్రసారమైన వార్తలపై మంగళవారం అయన వివరణ ఇచ్చారు. ఎమ్మెల్యే కూనంనేని ఇసుక దందాలు, భూకబ్జాలు చేస్తున్నారని తాను ఫిర్యాదు చేసినట్లు సదరు ఛానల్‌లో ప్రసారం చేయడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కేవలం కాంగ్రెస్ ఎంపీలను పిలిపించి ఎస్ఐఆర్ ప్రక్రియ గురించి మాత్రమే వివరణ తీసుకున్నారని ఎంపీ రఘురాం రెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈ ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి వివరాలు సేకరించారని, అందులో భాగంగానే తాము కూడా పాల్గొన్నామని తెలిపారు. ఈ భేటీలో కాంగ్రెస్ పార్టీ సాధించిన ప్రోగ్రెస్ రిపోర్ట్, క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మాత్రమే తాము మీనాక్షి నటరాజన్‌కు కూలంకషంగా వివరించామని చెప్పారు. రాజకీయ లబ్ధికోసమే ఇలాంటి తప్పుడు వార్త ప్రసారం చేయించారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వంలో సిపిఐ, కాంగ్రెస్ పార్టీలు కలిసికట్టుగా ఉన్నాయని, తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని రామసహాయం రఘురాం రెడ్డి వివరిస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

# రక్తం పాకెట్లతో రాజకీయం అవసరం లేదు..

తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు పొడిగించాలని తెలంగాణ కాంగ్రెస్ తెలంగాణ ఎన్నికల సంఘాన్ని కోరింది. ఈ మేరకు ఇవాళ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ బృందం వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంత్రి.. ఎస్ఐఆర్ ప్రక్రియ నత్తనడకన సాగుతోందని హైదరాబాద్‌లో 15 శాతం కూడా పూర్తి కాలేదని అన్నారు. బీఎల్ఓలు సరిగా పని చేయడం లేదని అధికార యంత్రాంగాన్ని ఉపయోగించుకోవాలని కోరినట్లు చెప్పారు.

**రక్తం పాకెట్లతో రాజకీయం అవసరం లేదు:**
అనంతరం మీడియోతో ప్రత్యేకంగా మాట్లాడిన మంత్రి.. అనేక మంది శాస్త్రవేత్తలు ఎల్ నినో ప్రభావంతో వాతావరణ శాఖ వర్షాభావ పరిస్థితులు ఇబ్బందులు ఉంటాయని చెబుతున్నారని మంత్రి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాకముందే కాళేశ్వరం కుంగిపోయిందని రక్తం పాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదన్నారు. కాళేశ్వరం కూలడానికి కారణం బీఆర్ఎస్ అని, ఊరూరూ తిరిగి ఆ పార్టీ కుట్రలు ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఎన్డీఎస్ఏ తుది నివేదిక ప్రకారం నీళ్లు నింపమని చెప్తే మేం వెంటనే నింపుతామన్నారు. మేము ఇంజనీర్లం కాదు.. ఇంజనీర్లు ఇచ్చిన సలహాలు పాటిస్తామన్నారు. ప్రాజెక్ట్ ఉపయోగంలోకి రావాలంటే ఏమి చేయాలో నిపుణులు చెబితే వెంటనే అమలు చేస్తామని చెప్పారు.

**ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు?:**
గత రెండు సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీ మౌనంగా ఉండి ఇప్పుడు కరువును దృష్టిలో పెట్టుకొని ప్రజలను రెచ్చగొడుతోందని విమర్శించారు. కావాలని మేడిగడ్డ ,కన్నెపల్లిపై రాజకీయం చేస్తున్నారని సాంకేతిక నిపుణులతో నేషనల్ డామ్ సేఫ్టీ అధికారులు ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఎల్ నినో ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరుపున సూచనలు చేస్తున్నామని కరువును దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలన్నారు. శంకర పరివారంలో ఆవు, పాము, నెమలి ఉంటాయి. అన్ని వ్యక్తిగతంగా వైరుధ్యం ఉన్న అక్కడ కలిసి ఉంటాయి ఇక్కడ కూడా తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో కోట్లడాలని రాజకీయ పార్టీలుగా అంతర్గతంగా ఎన్ని సమస్యలు ఉన్నా కలిసి ఎదుర్కోవాలన్నారు.బండి సంజయ్ ఎన్డీఎస్ఏను తుది నివేదిక ఇవ్వమని చెప్పాలన్నారు. వారు చెప్పి విధంగా నీళ్ళు నింపుతామన్నారు. నింపిన తరువాత ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు? అని ప్రశ్నించారు. గత రెండు సంవత్సరాలు గేట్లు వేయనప్పుడు ఎవరు మాట్లాడలేదని కేటీఆర్, హరీశ్ రావు ప్రభుత్వానికి సూచనలు చేయవచ్చు. కానీ లేనిది ఉన్నట్టు బట్ట కాల్చి మీద వేయవద్దన్నారు. బాధ్యతగా ప్రతిపక్షం సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు.

## సింగరేణిని కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయి

గోదావరిఖని : సింగరేణి సంస్థ అభివృద్ధిని కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం గోదావరిఖనిలోని ఫైవ్ ఇంక్లైన్ గని ఆవరణలో నిర్వహించిన బీజేపీ భరోసా యాత్ర సభలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు సుమారు 1.2 లక్షల మంది కార్మికులతో ఉన్న సింగరేణిలో ప్రస్తుతం దాదాపు 35 వేల మంది మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. సింగరేణి అభివృద్ధి కంటే రాజకీయ ప్రయోజనాలకే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సింగరేణి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా అంతర్గత విభేదాలతో కాలం గడుపుతోందని ఆరోపించారు. 135 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి సంస్థను కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయని, సంస్థకు ప్రభుత్వం చెల్లించాల్సిన నిధులు సకాలంలో అందక కార్మికుల జీతాలు చెల్లించేందుకు బ్యాంకుల నుంచి అప్పులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. సింగరేణికి రావాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి భవిష్యత్తు బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంటూ, తాడిచెర్ల బొగ్గు బ్లాక్--2ను నామినేషన్ విధానంలో సింగరేణికి కేటాయించామని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి సింగరేణి సమస్యలను తీసుకెళ్లిన అనంతరం ఈ బొగ్గు బ్లాక్ కేటాయింపు జరిగిందని చెప్పారు.
సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్య సేవలు, వారి పిల్లలకు నాణ్యమైన విద్యా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం బొగ్గు బ్లాకులను ప్రైవేటు సంస్థలకు కేటాయించిందని ఆరోపిస్తూ, 118 బొగ్గు బ్లాకుల కేటాయింపులపై కాగ్, సుప్రీంకోర్టు, సీబీఐ విచారణలు జరిగాయని, ఆ కేసులకు సంబంధించి కాంగ్రెస్ నాయకులు జైలు పాలయ్యారని పేర్కొన్నారు

## కూనంనేనిపై దుష్ప్రచారం చేయడం సరైంది కాదు

### మైనారిటీ నాయకులు డాక్టర్ నయీమ్ ఖురేషి

**కొత్తగూడెం, జూలై 14 (తెలంగాణ వాణి)**
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబ శివరావుపై దుష్ప్రచారం చేస్తున్నట్టు వస్తున్న వార్తలు ఆవాస్తవమని ఆ వార్తల్లో ఏ మాత్రం నిజం లేదని రాష్ట్ర మైనార్టీ నాయకులు డాక్టర్ నయీమ్ ఖురేషి ఒక ప్రకటనలో ఖండించారు. మచ్చ లేని నాయకుడిగా ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కూడా కొత్త గూడెం నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని నయీమ్ ఖురేషి తెలిపారు. ఎంపీ రఘురాం రెడ్డి, వీడియో ద్వారా వివరణ ఇస్తూ సాంబశివరావు మీద వస్తున్న ఆరోపణలు ఖండించారని తెలిపారు.

## మచ్చలేని నాయకుడు కూనంనేని

- తప్పుడు ప్రచారాలు చేసే ఛానళ్ళపై కఠిన చర్యలు తీసుకోవాలి
- నిరాధారమైన ఆరోపణలతో తప్పుడు వార్తలు ప్రసారం చేయడం తగదు
- రాజకీయ కుట్రలతోనే ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తున్నారు
- మీడియా సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా

**కొత్తగూడెం, జూలై 14 (తెలంగాణ వాణి)**



తప్పుడు ప్రచారాలు చేసే వార్తా ఛానళ్ళపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా డిమాండ్ చేశారు. కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుపై ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘురాంరెడ్డి కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఒక ఛానల్‌లో వచ్చిన వార్తలపై ఆయన మంగళవారం జిల్లా కేంద్రంలో ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ, గత నాలుగున్నర దశాబ్దాలుగా ఎలాంటి మచ్చ లేకుండా ప్రజల పక్షాన నిలబడి నిరంతరం శ్రమిస్తున్న నిజాయితీ గల నాయకుడు కూనంనేని సాంబశివరావు అని కొనియాడారు. నిరాధారమైన ఆరోపణలతో ఇలాంటి తప్పుడు వార్తలు ప్రసారం చేయడం తగదని, కూనంనేని వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యవహరించడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జికి తానేమీ ఫిర్యాదు చేయలేదని ఎంపీ రఘురాం రెడ్డి స్వయంగా ప్రకటించారని, ఛానళ్లలో తప్పుడు వార్తలు రావడం వెనుక పెద్ద రాజకీయ కుట్ర దాగి ఉందని మండిపడ్డారు. ఇప్పటికైనా మీడియా సంస్థలు వాస్తవాలు తెలుసుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఇలాంటి దుష్ప్రచారాలు మానుకోవాలని హెచ్చరించారు.

## స్నేహితుడే హంతకుడు.

భైంసా : నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో ఇటీవల ఎన్.ఆర్ గార్డెన్ సమీపంలోని బ్రిడ్జి కింద ఓ వ్యక్తి విగతజీవిగా పడి మరణించి ఉండగా.. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ కేసును దర్యాప్తు చేసి, చేదించారు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన విషయాలను మంగళవారం ఏఎస్పీ పత్తిపాక సాయి కిరణ్ మీడియాకి వెల్లడించారు. నయా ఆబాదికి చెందిన నసీర్ అహ్మద్ (27) ని అతని స్నేహితుడు మొహమ్మద్ సఫ్రాన్ అహ్మద్ (19) హత్య చేశాడని పేర్కొన్నారు. గతంలో జరిగిన డబ్బుల వివాదం కారణంగా నసీర్ గ్యారేజీలో ఇద్దరి మధ్య గొడవ చోటు చేసుకోగా, నిందితుడు అక్కడ ఉన్న రెండు సుత్తులతో నసీర్ అహ్మద్ తలపై పలుమార్లు దాడి చేసి హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందని అన్నారు. అనంతరం నేరాన్ని దాచిపెట్టేందుకు మృతదేహాన్ని ఐరన్ మెషిన్ బాక్స్‌లో ఉంచి, మోటార్ సైకిల్ పై తీసుకెళ్లి ఆటోనగర్ చోటా బ్రిడ్జి సమీపంలోని మురికి కాలువలో పడవేసినట్లు పోలీసులు వెల్లడించారు. సఫ్రాన్ అహ్మద్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.



# 'దండోరా' దర్శకుడితో సినిమా?

గత కొంతకాలంగా సరైన విజయాలు లేక నిరుత్సాహంలో ఉన్నారు హీరో నితిన్. గత ఏడాది విడుదలైన 'తమ్ముడు' కూడా పరాజయంపాలైంది. వరుస ఫెయిల్యూర్స్‌తో సినిమాలకు ఏడాది పాటు గ్యాప్ తీసుకున్న నితిన్.. ఇటీవలే మూడు సినిమాలకు ఓకే చెప్పిన విషయం తెలిసిందే. అందులో ఓ చిత్రాన్ని వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై హీరో నాని తెరకెక్కించబోతున్నారు. 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దర్శకత్వం వహిస్తాడు. 'దండోరా' తరహాలోనే తెలంగాణ నేపథ్యంలో సామాజిక అంశాలను స్పృశిస్తూ సాగే సినిమా ఇదని సమాచారం. ఇందులో నితిన్‌కు జోడీగా రుక్మిణి వసంత్ నటించబోతున్నది. గ్లామర్ హంగులకు దూరంగా పర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్‌గా ఆమె పాత్ర సాగుతుందని చెబుతున్నారు. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుంది. ఆగస్ట్‌లో ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్తుందని సమాచారం.

# నాగచైతన్య కొత్త సినిమా?

ప్రస్తుతం అగ్ర కథానాయకుడు అక్కినేని నాగచైతన్య 'వృషకర్మ' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్నది. ఈ సినిమా తర్వాత చేయాల్సిన ప్రాజెక్ట్‌ని కూడా నాగచైతన్య ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు. 'బెదురులంక 2012' చిత్రం ద్వారా గుర్తింపు తెచ్చుకున్న క్లాక్స్ దర్శకత్వంలో ఆయన తర్వాత సినిమా ఉంటుంది. ఈ సినిమాను ఈ ఏడాది చివర్లో సెట్స్ పైకి తీసుకెళ్లే యోచనలో చైతూ ఉన్నారు. ఇదిలావుంటే.. ఈ క్రమంలోనే 'మసూద' దర్శకుడు సాయికిరణ్ కూడా ఇటీవలే చైతూకి కథ వినిపించారట. తన తొలి సినిమా 'మసూద'తో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న సాయికిరణ్, గత రెండేళ్లుగా ఓ హారర్ థ్రిల్లర్ స్క్రిప్ట్‌పై వర్క్ చేశారు. ఏషియన్ సునీల్ నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్ కోసమే చైతూని సాయికిరణ్ కలిసినట్టు, కథ వినిపించినట్టు తెలిసింది. అన్నీ కుదిరితే వచ్చే ఏడాది ఈ సినిమా సెట్స్‌పైకెళ్లే అవకాశం ఉన్నది.





# మా అమ్మ భావోద్వేగానికి గురయ్యారు: భాగ్యశ్రీ బోర్సే

"లెనిన్' సినిమా విజయం నాకు గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. నేను చేసిన భారతి పాత్ర పట్ల ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమ, ఆదరణ జీవితాంతం మర్చిపోలేను. 'లెనిన్'లో నా నటన పట్ల మా అమ్మానాన్నలు చాలా సంతోషంగా ఉన్నారు. మా అమ్మగారు నాకు ఫోన్ చేసి, 'సినిమా చాలా బాగుంది.. నీ నటన కూడా ఎంతో బాగా అనిపించింది' అన్నారు. అయితే భారతి పాత్ర ముగింపు చూసి ఒక తల్లిగా చాలా భావోద్వేగానికి గురయ్యారు. ఎందుకంటే అలాంటి ముగింపును ఏ తల్లి కూడా కోరుకోదు కదా?" అని హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే పేర్కొన్నారు. అక్కినేని అఖిల్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రం 'లెనిన్'. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ అయింది. ఈ చిత్రంలో భారతి పాత్ర పోషించిన భాగ్యశ్రీ బోర్సే చెప్పిన విశేషాలు...

"లెనిన్' కథని మురళీ కిషోర్‌గారు చెప్పినప్పుడే నా మనసుకు హత్తుకుంది. భారతి పాత్రలో నటనకు మంచి అవకాశం ఉందని అప్పుడే అనిపించింది. ఇప్పుడు ప్రేక్షకులు ఆ పాత్రను ఇంతగా అభిమానించడం చాలా సంతోషంగా ఉంది. భారతి పాత్ర గురించి అందరూ ఎంతో ప్రేమగా మాట్లాడుతున్నారు. నాగార్జునగారు నా నటన గురించి మాట్లాడటం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఈ ప్రశంసలు నాకు సంతోషంతో పాటు మరింత బాధ్యతను కూడా పెంచాయి. బులెనిన్--భారతిల ప్రేమకథే 'లెనిన్'. అఖిల్, నా పాత్రలు తెరపై చాలా సహజంగా కనిపించేలా ప్రతి సన్నివేశంపై ఎంతో శ్రద్ధ పెట్టి పనిచేశాం. భవిష్యత్తులో మహారాణి, యువరాణి వంటి పాత్రలు చేయాలని ఉంది. అలాంటి చిత్రాల విషయంలో రాజమౌళిగారు మాస్టర్. ఏదో ఒక రోజు ఆయన దర్శకత్వంలో నటించాలని ఉంది. 'మా ఇంటి బంగారం' సినిమాలో సమంతగారు అద్భుతంగా నటించారు. మాలాంటి కొత్త నటీమణులకు ఆమె ఒక దారి చూపించారు. అవకాశం వస్తే అలాంటి మహిళా ప్రధాన పాత్రలు కూడా చేయాలని ఉంది. ప్రస్తుతం శివ కార్తికేయన్ తో తమిళంలో 'సీయోన్' సినిమా చేస్తున్నాను. అలాగే తెలుగు, తమిళ భాషల్లో మరికొన్ని కథలు వింటున్నాను. వాటి వివరాలు త్వరలోనే వెల్లడిస్తాను.

# ఆత్మతో కనకరాజు అవస్థలు



మెగా హీరో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు'. యూవీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉన్నది. ఆగస్ట్ 7న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ఇప్పటికే ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చిందని మేకర్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. అగ్ర కథానాయకుడు ప్రభాస్ ఈ టీజర్‌ని ఆవిష్కరించి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. రాయలసీమలోని పెనుగొండ ప్రాంతాన్ని పరిచయం చేస్తూ కనకరాజు వాయిస్ ఓవర్‌తో టీజర్ మొదలైంది. సరదాగా సాగే కనకరాజు జీవితం, ఓ కొరియన్ అమ్మాయిని ప్రేమించిన తర్వాత ఎలా మారింది? అనేది ఈ టీజర్‌లో ఆసక్తికరంగా సాగింది. ఆత్మలు, అతీంద్రియ శక్తుల నేపథ్యంలో కామెడీ, యాక్షన్, ఫాంటసీ హారర్ అంశాలతో ఈ కథ సాగుతుందని టీజర్ చెబుతున్నది. రాయలసీమ గ్రామీణ నేపథ్యాన్ని, కొరియా వాతావరణాన్ని మేళవిస్తూ వినోదాత్మకంగా దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయిక. సత్య కీలక పాత్ర పోషిస్తున్నారు. కెమెరా: మనోజ్ రెడ్డి, సంగీతం: తమన్.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com